అపూర్వబ్రహ్మచర్య ప్రహసనము.

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

మూడవ కూర్పు

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము

రాజమహేంద్రవరము.

1950

అపూర్వబ్రహ్మచర్యప్రహసనము

ఇందువచ్చు పాత్రములు

రామాకాంతము పంతులు—కథానాయకుఁడు.

కరటకరెడ్డి—పంతులవారి సేవకుఁడు.

వెంకఁడు—తోఁటపనివాఁడు.

సోమభట్టు—పురోహితుఁడు.

శ్యామలాంబ—రామాకాంతము పంతులభార్య.

మోహిని—కరటకరెడ్డి భార్య.

రంగము—రాజమహేంద్రవరము రామాకాంతము పంతులుగారి గృహము

[సేవకుఁడు కరటకరెడ్డి ప్రవేశించుచున్నాఁడు]

కర—ఇక్కడికి రెండు సంవత్సరాలనుంచి నాభార్యను నా యజమానుడి కంటపడకుండా కాపాడుకొనివచ్చినాను. అతనికంట బడితే యికనాకు భార్యఆశ లేదు. యిదివరకూ నాయజమానుఁడు నేను బ్రహ్మచారిననే భ్రమతో నీవున్నాడు. యీప్రకారంగానే యింకా మోసంచేస్తూ నాబుద్ధిబలంచేత యీభ్రమ యెల్లకాలమూ వుండేటట్టు చేస్తాను. నాకు పెళ్లామువున్నట్టు పంతులుగారికి తెలిసి వున్నట్టయితే యిదివరకే నాకొంప మునిగేది. పెళ్ళాలువున్న యీ వీధివాళ్ళంతా ఆయనజీవానికి వుసూరుమని యేడుస్తూవున్నారు. ఆయన మ్యూనిసిపల్ కమీషనరూ లోకల్ ఫండు మెంబరూ బెంచి మేజస్ట్రీటూ డిస్ట్రిక్టుకోర్టు ప్లీడరూ కావడంచేత యెప్పుడు యేమి చేసిపోతాడో అని అందరూ జడుస్తూవుంటారు. వాసుదేవరావు పంతులుగారిభార్య పుట్టింటికి వెళ్ళబోతూవుండడంచేత ఆవిడనిమిత్త

మాపంతులుగారు యీవాళ స్టీమరుదాటి కొవ్వూరు వెళుతారు. అమ్మగారు పుట్టింటికివెళ్ళినారు. ఈవేళ నేను నాభార్యను యిక్కడకు దీసుకునివచ్చి అమ్మగారి పడకగదిలో నేనుయీరాత్రిఅంతా ఖులాసాగా వుంటాను; అవతలినుంచి యెవరో వస్తూవున్నట్టున్నారు.

[రామాకాంతము పంతులుగారు ప్రవేశించుచున్నారు]

రామా—కరటకా! కరటకా! వాసుదేవరావు పెళ్ళాము స్టీమరుమీదికి వెళ్ళిందా?

కర—ఇప్పుడే వెళ్ళింది. మీరు వెంటనే వెళ్లితే స్టీమరు అందుతుంది. మీరు వేగిరం బయలుదేరవలెను. (తనలో) నేను యీరాత్రి యీమెనను యెలాగయినా పంపించివెయ్యవలెను.

రామా—నన్నుకూడా వెళ్ళమన్నావా? మీఅమ్మగారుకూడా వూళ్లో లేరు. ఇల్లునీవు చూస్తూవుంటావా?

కర—అవశ్యంగా వెళ్ళండి. నేను బ్రహ్మచారిని. పెళ్లాము వద్దకుపోవలసిన పనిలేదు. నేనీరాత్రి యిక్కడనే పరుండి మీయిల్లూ వస్తువులూ మీకుపదిలంగా వప్పగిస్తాను.

రామా—ఈలోగా వూరినుంచి మీఅమ్మగారు రాదుగదా? మగవాణ్ని కావడంచేత నేనుదాన్ని వదలిపెట్టివుండగలిగినా, అది పనికిమాలిన ఆడది కావడంచేత పట్టుమని పదిరోజులయినా పుట్టింటికాడ నన్ను వదలిపెట్టి వుండలేను. నేనువర్తమానం పంపించకుండానే బండి చేసుకుని దుడుంగున వస్తూవుంటుంది. పుట్టిల్లు దగ్గిర వూరు కావడంచేత యీఅసందర్భం వస్తూవుంటుంది.

కర—ఆవిషయంలో మీరేమీ భయపడనక్కరలేదు. అమ్మగారు యీరోజుకురారు. వక వేళవచ్చినా నేను సర్ది చెప్పి మీరు కొవ్వూరు తగాదాలో స్థలంచూడడం నిమిత్తం వెళ్ళినారని చెపుతాను. స్టీమరు మించిపోతుంది. మీరుత్వరగా వెళ్ళవలెను.

రామా—నేను వేగిరం వెళ్ళవలెనని నీకు బహుతొందరగా వున్నది. యెందుచేత?

కర—నాకుయేమీ తొందర లేదు. కావలిస్తే వెయ్యేళ్ళు యింట్లోనేవుండండి. వకరోజయినా వూరు దాటిపోతే చాలునని సంతోషించడానికి నాకు పెళ్ళామయినా వున్నదా యేమిటి?

రామా—అహాహాహా. పెళ్ళాలువున్న వాళ్ళందరికీ నేను వెళ్ళిపోవలెనని వుంటుందేమి? నేను యిప్పుడు వ్యభిచారంమానివేసి పెద్దమనిషి నవుతూవున్నాను. మీదటినుంచి బొత్తిగా మానివేస్తాను. నేను వాసుదేవరావు పెళ్ళాము జానికమ్మనువిడిచి వక్కనిముషం తాళలేను. ఆవిడె కేవలమూ జానకీదేవే. నాపాలిటికి శ్రీమహాలక్ష్మి. నీమాట తీసివెయ్యరాదు. నేనుకూడా ఆస్టీసుదులోనే వెళుతాను. నేను వెళుతూవున్నాను. ఇల్లు పదిలము. మీఅమ్మగారు తానువచ్చేలోగా మంచిదాసీని కుదుర్చుమని చెప్పిపోయింది. ఆమాటమరచిపోకు. ఇవిగో యింటితాళము చెవులు. రేపు ఆదివారంగనుక నేను రావడం రెండురోజులు ఆలస్యమయినా యీలోవుగా అమ్మగారు ధవిళేశ్వరంనుంచివస్తే తాళంచెవులియ్యి. (అని వెళ్ళుచున్నాడు)

కర—ఈయనను వదల్చుకున్నాను. ఇక నాపెళ్ళాం యిక్కడకు స్వేచ్ఛగా రావచ్చును. వచ్చేటప్పుడుమాత్రం నాపెళ్ళాము దోవలో యీయనకంట పడకుండా రావలెను. ఆలావస్తే ఈరాత్రి మాప్రభువుగారి పడకగదిలో పందిరి పట్టెమంచంమీద మా మోహినీ నేనూ రాజదంపతులలాగు వుంటాము. అదుగో మోహిని వస్తూవున్నది.

[అప్పుడు మోహిని ప్రవేశించుచున్నది.]

మోహి—కరటకరెడ్డీ! నీయజమానుడు వూరికివెళ్ళినాడా?

కర—నీ పుణ్యంచేత యిప్పుడే వెళ్ళినాఁడు. నీకు వీధిలో యెదురుపడలేదుఁగద? నీవు అదృష్టవంతురాలవు. నీకుయీరాత్రి పందిరి పట్టె మంచమూ పరుపూ దొరకుతుంది. నీవు మన వివాహంమాట మాత్రము యెవరితోనూ చెప్పకుమా.

మోహి—యెవరితోనూ చెప్పను. వక్క నా స్నేహితులు బుచ్చితోనూ అచ్చితోనూమంగితోను— (ఆలోచించి)—యింకా యెవరితో చెపుతానా? మా మేనమామ పుల్లిగాడితోకూడా—

కర—సరి యేడిసినట్టేవున్నది నీరహస్యం. డప్పువుచ్చుకోని టముటమా వేసి మాదిగవాడితోకూడా చెప్పు. నాయజమానుడితో నాకు పెళ్ళికాలేదని చెపుతూవున్నానుగదా! నాగుట్టు ఆయనకు తెలిస్తే!

మోహి—ఎవరితోనూ చెప్పవద్దని వాళ్ళచేత చేతిలోచెయ్యి వేయించుకొంటానులే.

కర—నీ రహస్యం నీవుదాచుకోలేవుగాని యిక యితరులు దాస్తారా? యెలాగా నా యజమానుడికి తెలియకమానదు. ఆడ దాని వద్ద రహస్యం దాగదని పెద్దలుచెప్పినమాట పూరి కేపోతుందీ?

మోహి—అవును. నావద్ద రహస్యందాగదు. రహస్యం దాగవలెనంటే నీవు నాకు తెలియకుండానే పెళ్ళి చేసుకోలేక పోయినావా?

కర—సరిసరి యిది మరీచిత్రముగావున్నది. నీకు తెలియ కుండానే నిన్ను నేను పెళ్ళిచేసుకోవలసినది కాదూ? ఇటువంటి దేవ రహస్యాలు నా యజమానుడికేకాని నాకు తెలియవు.

మోహి—మనరహస్యం నీ యజమానుడికి తెలిస్తేమాత్రం మనకు వచ్చిన భయం యేమిటి? నన్నుచూచి అతఁడు సంతోషిస్తాడో లేదో వక్కపర్యాయం తీసుకుని వెళ్లి చూపు. తాను

పెళ్లిఅడి సుఖపడుతూవున్నప్పుడు నవుకర్లు పెళ్లి ఆడితేమాత్రం యెందుకు కోపంవుంటుంది?

కర—నిన్నుచూస్తే అతడు తప్పకుండా సంతోషిస్తాడు. అతడికి పెళ్ళిమాత్రమే యిష్టంలేదుగాని నీవంటి పడుచు పెళ్ళి కూతుళ్ళంటే చాలాయిష్టమే.

మోహి—అలాగయితే యింకా యెన్నాళ్ళు నేను యీ రహస్యం దాచవలెను.

కర—యెన్నాళ్ళో అక్కరలేదు. నేను ఈయనదగ్గిర నవుకరీ వదులుకున్నదాకా దాస్తేచాలును. నాకిప్పుడు ముప్ఫయియేళ్ళు వున్నవి. ముసలవాణ్ని అయినతరువాత నేను నవుకరీ తక్షణం మానుకుంటాను. నేను నవుకరీ మానుకున్నదాకా దాచలేకపోతే నాయజమానుడు ముసలవాడయినదాకానయినా దాచు. అంతే చాలును. అతడు నాకంటె నాలుగేళ్ళుమాత్రం చిన్నవాడు. నీవలాచేస్తే నాకు యితడు డబ్బు చాలా యిస్తాడుగనుక నేను యెప్పుడూ నవుకరీవదులుకోకుండా సుఖంగా వుంటాను.

మోహి—నీవు నవుకరీ వదులుకున్నదాకానే రహస్యం దాచుతానుగాని అతడు ముసలివాడైనదాకా నేను దాచలేను. ఈలోగా యేలాగయినా కష్టపడుతానుగాని నాకోసం నీవు రేపు వుదయాన్నుంచీ తప్పకుండా నవుకరీ మానుకుందూ.

కర—నవుకరీ మానుకుంటే నీకు నగలూ బువ్వా యెక్కడ నుంచీ వస్తుంది?

మోహి—అలాగయితే నీవు డబ్బుబాగా సంపాదించి పరుపులూ పంట్లైమంచాలూ చేయించి నాకు నవుకర్లనూ పెట్టి బండిలో యెక్కించి నన్ను వూరంతా తిప్పి సుఖపెడుతావా!

కర—అవన్నీ యీ రాత్రేచేస్తాను. ఈ రాత్రి మనం అమ్మగారి గదిలో పరుపులమీదను పట్టెమంచాలమీదనూ పరుండాము; చీకటిపడ్డతరువాత పంతులుగారిబండిలో యెక్కించి సిన్నుపెద్దవీధిగుండా తిప్పుతాను; తోటమాలీ వెంకడిచేత నీకు కావలసినన్ని పనులు చేయిస్తాను.

మోహి—అలాగయితే పెళ్లినాడు పెట్టిన మధురచీర కట్టుకుని నిమిషాలలో నేను యింటికి వెళ్ళిమళ్ళీవస్తాను. ఈలోపుగాబండీ అన్నీ సిద్ధముచేయించు.

కర—వెళ్ళి యిక్కడవున్నట్టురా. నీవు వచ్చేటప్పటికి ఫలహారానికి మిఠాయికూడా తెప్పించివుంచుతాను. మనంఫలహారంచేసి చల్లపాటువేళ చల్లగాలిలో హాయిగా షికారుబయలుదేరుదాము.

మోహి—మంచిగంధమూ మల్లెపూవ్వులూకూడా తెప్పించవలెనుసుమా.

(అని పోవుచున్నది.)

కర—ఓరీ! వెంకా! తోటపని మానివేసి యిలారా.

వెంక—(ప్రవేశించి) బాబూ! యెందుకండీ?

కర—పంతులుగారు వూరికి వెళ్ళేటప్పుడు నీవు తోటపని మానివేసి ఈరోజల్లా నావర్దీలోవుండి నేను చెప్పినపనల్లా చేయుమన్నారు. విన్నావా? నేను చెప్పినపని చెయ్యకపోతే నీకు నవుకరీ వుండదుసుమా. నీవు పెందరాళే భోంచేసివచ్చి రాత్రి నేనూ నాభార్యా పడుకున్నప్పుడు నీవుమాకు పంఖావిసరవలెను. బండివానితో చెప్పి సాయంకాలము షికారువెళ్ళడానికి బండికట్టించి తయారుగా వుంపించు. నీవు ముందుగాపోయి నేను యిమ్మన్నానని పంతులుగారికి వాడుకగా మిఠాయి యిచ్చే కిసిన్‌సింగువద్ద యేబులం ఫంచదారమిఠాయి రెండుపొట్లాలు కట్టించుకునిరా.

వెంక—అలాగే చేస్తానుకానండి నీళ్ళులేక పువ్వులచెట్లు చచ్చిపోయినవని రేపు పంతులుగారు కోపపడితేనో—

కర—నాదగ్గిర యెదురుమాటచెప్పక చెప్పినట్టుచెయ్యి. నీకు. కొత్తగనుక యింకా తెలియలేదుగాని నాఆజ్ఞఅంటే పంతులుగారి ఆజ్ఞకంటేనూ యెక్కువ. పంతులుగారికి కోపమువచ్చినా నీవు పనిచెయ్యగలవుగాని నాకు కోపంవస్తే వక్కనిమిషం పనిచెయ్యలేవు. పంతులుగారు నిన్ను అంతగా అడిగితే నేను పనిమీద పంపించినానని చెప్పు.

వెం—చిత్తము. చిత్తము.

కర—ముందుగాపోయి మిఠాయి తీసుకునిరా. పో.

వెంక—పణసతొనల మిఠాయా! (అని వెళ్ళుచున్నాడు)

కర—నేను యీవాళ నాయజమానుడికంటెనూ యెక్కువగా వుంటాను. ఈపాటి మోహిని వస్తూవుంటుంది. యెవరో వస్తూవున్నట్లు అడుగుల చప్పుడవుతూ వున్నది. అది మోహినే అయివుండును. కాదు బూట్సు చప్పుడులాగువున్నది. అదియేమి నాయజమానుఁడు మళ్ళీ వస్తూవున్నాడు! అయ్యో! దైవమా! ఏమి యీ దురదృష్టము! ఇప్పుడు మోహినివచ్చి యితనికంటపడితే నా కాపురం కూలిపోయిందే. ఇఖ నేను సంసారానికి నీళ్లువదులుకోవలెను. నేను యేదోపని కల్పించుకొని వీధిలోకి వెళ్ళి నా పెళ్ళామును.రావద్దని చెప్పివస్తాను. ఈలోపుగా మిఠాయి పట్టుకొని వెంకడు రాడుగదా?

[అప్పుడు రామారావు తను సంచులు ప్రవేశించుచున్నాఁడు]

రామా—కరటకా!

కర—(ఎవ్వరయిన వచ్చుచున్నారేమోయని గుమ్మంవంక చూచుచు) అయ్యో! ఏమి! మీరు వెళ్ళినారు కారేమి?

రామా—నేను స్టీమరువద్దకు వెళ్ళేటప్పటికి వక్కతమాషా జరిగింది. టిక్కెట్టు పుచ్చుకొని, ఆతమాషాచూచి మళ్ళీవత్తామని యిక్లేఅవతలికి వెళ్ళేటప్పటికి స్టీమరువాళ్లు స్టీమరు తీసుకుని చక్కాపోయినారు. రివిన్యూ వుద్యోగస్థులకోసం కనిపెట్టుకునివుంటూ నాని మిత్రం యెందుకు కనిపెట్టుకుని వున్నారు కారో వాళ్ళపని నేను రేపు పట్టిస్తాను. రెడ్డీ! ఆతమాషాయేమో నీవువూహించగలవా?

కర—నాకు ఆమాత్రం బుద్ధిలేదు. అయినా కానీ మీకు యెవర్తో చక్కనిపడుచుచిన్నది కనపడ్డదనుకుంటాను.

రామా—నీవు చక్కగా కనిపెట్టినావు. నీకుజ్యోతిషంకూడా తెలిసినట్లున్నదే? నీవు మాసిద్ధాంతిగారికంటెను దాఖలాగా చెప్పినావు. నీవెక్కడ బుద్ధిహీనుడవు? నీవు బుద్ధికి బృహస్పతివి.

కర—ఇదంతా మీదయ.

రామా—నాకు మూడురోజులకింద రతీదేవివంటి వొక్క చక్కనిచిన్నది నేనూ నాస్నేహితుడూ కలిసివస్తావుండగా కనపడ్డది. ఆచిన్నదే స్టీమరుమీదికి యెక్కబోతూ వుండగా కనపడ్డది. ఆచిన్నదే స్టీమరుమీదికి యెక్కబోతూ వుండగా దూరంగా మళ్ళీ కనపడ్డది. నేను రేవులోనుంచి వీధి మొగకు వచ్చేటప్పటికి యేయింట్లోకిపోయిందో మళ్ళీకనపడ్డదికాదు. వీధంతా యీచివరినుంచి ఆచివరకు నాలుగుమాట్లు తిరిగి యెక్కడా కనపడక 'ఇంతలో' స్టీమరుకూడా దాటిపోయినందున తిరిగి యింటికివచ్చినాను.

కర—(తనలో) ఇతనికేదో గొప్పయెరవొరకింది. అందుచేత యితణ్ని మళ్ళీ పంపించివేసి యీరాత్రి నేను భార్యతో సుఖంగా వుండవచ్చును. ఇతణ్ని మాయచేసి యెక్కడా పడుచులులేని యింటియెదుట వీధిఅరుగుమీద తెల్లవారిందాకా కూర్చోపెట్టివస్తాను. (ప్రకాశముగా) మీకుకనపడ్డచిన్నది యెఱ్ఱని పలచని చిన్నదికాదుగదా?

రామా—అవును యెఱ్ఱనిచిన్నదే. ఇంకాయేదయినా ఆనవాలు చెప్పు.

కర—ఆ ట్టేపొట్టి కాకుండా పొడుగూకాకుండా వుంటుంది.

రామా—అవును ఆలాగేవుంటుంది. మరివకగురుతు చెప్పు.

కర—తలవెండ్రుకలు నల్లగావుంటవి కొప్పు పెడుతుంది.

రామా—అందరూ కొప్పుపెడుతారు; అందరి తలవెండ్రుకలూనల్లగానేవుంటవి. ఇదేంఆనవాలు?

కర—ఆలాగైతే యెవరికీలేని మంచి ఆనవాలు యింకొకటి చెపుతానువినండి. ఆచిన్నది కుంకుమబొట్టు పెడుతుందికాదూ? కళ్ళకి కాటుక పెడుతుంది.

రామా—ఈరెండు పనులూ అందరూచేస్తారు.

కర—అందరూయెందుకు చేస్తారు? మాఅన్నగారి పెళ్ళాం చెయ్యేదు. ఆవిడ యెప్పుడూ బొట్టుపెట్టుకోదు; కాటుకపెట్టుకోదు. కొప్పుపెట్టుకోదు· గాజులుపెట్టుకోదు.

రామా—మీఅన్నపెళ్ళాం వెధవచిన్నది కాబోలును.

కర—అవును. వెధవచిన్నదే కాబోలును. మీరన్నది యే అన్నపెళ్ళామూ? ఇప్పుడు మీ మేనమామగారియింట్లో పనిలోవున్న అన్నగారి.పెళ్ళాముకాదూ? ఆవిడవెధవే. ఆవిడను మొగుడు కోపమువచ్చినప్పుడు యెప్పుడూ వెధవా వెధవా అంటూవుంటాడు. నిఱుడుమరిడీజాడ్యాలలో చచ్చిన అన్నగారిపెళ్ళాం వక్కత్తే మాత్రం విధవ కాదు.

రామా—మీఅన్నగారు బ్రితికివుండగా పెళ్ళాం వెధవ యెలాగయిందోయి?

కర—నన్నువూరికే ప్రిశ్నలువేసి భ్రమపెట్టకండి. మీరు యేభయిప్రిశ్నలు వేసినా నేను అబద్ధంఆడను. మహా రా జు లా గు

యింట్లోకూర్చునేవారికి మీకు లోకంసంగతి యేమి తెలుస్తుంది? లోకంలో దేవరరహస్యాలుయెన్నోవుంటవి. యెరిగినవాణ్ని నామాట నమ్మండి. మొగుడు బ్రతికివుండగానే కొందరు పెళ్ళాలు వెధవలూ అవుతారు; పెళ్ళిఅయినతరువాతకొందరు గృహస్థులు బ్రహ్మచారులూ అవుతారు. ఇవన్నీ ఇప్పుడెందుకుగాని మీరుచూచినది పొన్నమండ భీమన్నకూతురు. దాని మొగుడు ముసలివాఁడు.

రామా—ఆచిన్నదాని సంగతంతా నీవిదివరకే యెరుగుదువా?

కర—ఒక్క యెరగడమేకాదు. రేపుతెల్లవారేలోగా ఆచిన్నదాన్ని మీసొమ్మే చేసివేస్తాను. మీరు యిప్పుడే బయలుదేరి వారి యింటికి యెదురుగుండావున్న అరుగుమీద ఈరాత్రంతా పరుండవలెను. తెల్లవారేలోగా మీకాచిన్నదాన్ని తీసుకునివచ్చి మీకన్నుల పండుగచేస్తాను. మీకు తెలియకుండా మీవద్దకు తీసుకురావడానికై మీనిమిత్తం నేను ప్రయత్నంచేస్తూవున్నదే ఆచిన్నది.

రామా—ఆలాగా? నీవు బహుబుద్ధిమంతుఁడవు. నీఋణం నేను వుంచుకోను. ఆచిన్నదాన్ని నాకుదక్కించితివా, నీకు యిరువయిరూపాయయలు బహుమానంచేస్తాను. నేను యెప్పుడూ చేసిన మేలు మరచిపోనుసుమా.

[అప్పుడకస్మాత్తుగా మగనివెనుకవైపునుండి మోహిని లోపలికి వచ్చుచున్నది.]

కర—ఆయిరవై రూపాయలూ నాచేతిలోపడ్డవే. పాపం దానిమొగుడు అదృష్టహీనుఁడు.

రామా—(మోహినినిచూచి) ఏమి యీభాగ్యము! కరటకా! ఇవిగో నీరూపాయలుపుచ్చుకో. (అని చేతిలోపెట్టుచున్నాఁడు.)

కర—ఏమియీభాగ్యము! నాకుముందుగానే రూపాయలు యిస్తూవున్నారు! (అని వెనుకతిరిగి మోహినిని చూచుచున్నాఁడు.)

మోహి.—(తెల్లబోయి నిలుచున్నది.)

రామా.—ఆచిన్నదాన్ని మాటలోనే యిక్కడికితలవని తలంపుగారప్పించినావు! ఈమెకు వెయ్యేళ్ళు ఆయుస్సున్నది.

కర.—(తనలో) అయ్యో! నాకొంపమునిగింది.

మోహి.—కరటకా! నన్ను క్షమించు. నేను అసయంలో వచ్చినాను.

రామా.—అసమయంకాదు మంచిసమయంలోనే వచ్చి నావు. నాభార్యపూళ్ళోలేదు, ఈరెడ్డి నిన్నుగమ్మన్నది నానిమిత్తమే

కర.—(మోహినితో రహస్యముగా) ఇతఁడేనాయజమానుఁడైన రామా కాంతముపంతులు. మనరహస్యంజాగ్రత.

రామా.—సుందరీ! నీపేరెవరు?

మోహి.—నాపేరు మోహిని. నేను మీపాదసేవకురాలను.

కర.—(రహస్యముగా) ఇతనికి పాదసేవకురాలవా? నీవు అలా అనబోకు.

మోహి.—నేను నిజముగా సేవకురాలనుకాను. గోదావరి యొడ్డున కాపురమున్న ముసలిగంగమ్మ కూతురిని.

రామా.—ముసలిగంగమ్మకూతురవా? పాపము! మొగుడు పోయినప్పటినుంచీ జీవనానికి జరగక గంగమ్మ చాలాయిబ్బంది పడుతూవున్నట్టున్నది. మీరు నిర్విచారంగా వుండండి. మీయిద్దరినీ నేనేపోషిస్తాను. నీవు మాపిల్లవాళ్ళను యెత్తుకుంటూ వుంటేవుగాని నీతల్లి నీతోవుంటుంది. మీరు రేపువచ్చి మాతోటయింట్లో దిగండి కరటకా! నీవు వీరి సంరక్షణ కనుక్కుంటూవుండవలెను.

కర.—(లేచి మోహినికిని రామా కాంతము పంతులకును నడుమవచ్చి మోహినిని పొమ్మని సైగచేయుచు) మీకు పిల్లలు లేనిదీ యేపిల్లల నెత్తుకొంటుంది?

రామా—(కరటకశెట్టిని వెనుకకుతోయుచు) ఆపని కాక పోతే మరివకపని చెపుతాను. ఈచిన్నది నేటినుంచీ పనిలోవున్నట్టే.

కర—(పని యొప్పుకోవద్దని వెనుకనుండి సైగచేయు చున్నాడు.)

మోహి—సాకుపనివద్దు.

రామా—నీయిష్టమైనపని చెయ్యవచ్చును. నీకేపని చేత నవునో చెప్పు.

మోహి—నాకేపనీ చేతకాదు.

రామా—ఏపనీచేతకాకపోతే, తోటమాలీ పువ్వులచెట్లకు నీళ్ళుపోస్తూవున్నాడో లేదో చూస్తూవుందువుగానిలే. మీరు రేపు వచ్చి మాయింట్లో ప్రవేశించండి. కరటకా! నీవు యీరాత్రే మన తోటయిల్లు ఖాళీచేయించు.

మోహి—మాయింటికి భోజనానికి వెళ్ళవలెను, నన్ను పోనియ్యండి.

రామా—నీకు తినడానికి పంచదార మిఠాయి తెప్పిస్తాను. వక్కనిముషంవుండు. మనము యిద్దరమూ తిందాము. కరటకా! నీవు పరుగెత్తుకొనివెళ్ళి వకవీసెడు పంచదార మిఠాయి పట్టుకునిరా.

మోహి—నేను మాఅమ్మను అడిగిరావలెను.

రామా—నేను నిన్ను బండిలో తీసుకునివెళ్ళి మీయింటివద్ద దిగబెట్టివస్తానులే. తొందరపడకు. కరటకా! కదలవేమి? వేగిరము మిఠాయీ పళ్ళూ తీసికునిరా.

కర—(తనలో) నాకు చావుగావున్నది. (ప్రకాశముగా) మోహినితల్లియింటివద్దకనిపెట్టుకొని వుంటుంది. కూతురు వేగిరం రాకపోతే యేమి అపాయంజరిగిందో అని ముసలిది యేడిచిపోతుంది ఈచిన్నదాన్ని వేగిరంపంపించి వెయ్యండి.

రామా—అలాగైతే యీచిన్నది సుఖంగా వున్నదని నీవు పరుగెత్తుకొనిపోయి చెప్పిరా.

కర—(తనలో) నాకు మతిపోతూవున్నది. ఇప్పుడేమి చెయ్యడానికీ తోచకుండావున్నది. తొందరపడి యేమయినాచేస్తే నాపనికి నీళ్ళువదులుకోవలెను.

[మిఠాయి పొట్లము పట్టుకొని వెంకడు ప్రవేశించుచున్నాడు]

వెంక—రెడ్డిగారూ! ఇదిగో మిఠాయి తెచ్చినాను.

కర—(తనలో) వీడుకూడా సమయానికే వచ్చినాడు.

రామా—వెంకా! పొట్లము యిలాతీసుకొనిరా. ఇది మా కోసము. అని (పుచ్చుకొనుచున్నాడు) ఓరీ! నీవు వెళ్ళి బండివాణ్ణి బండికట్టి సిద్ధముగా వుంచుమని చెప్పు.

వెంక—రెడ్డిగారి సెలవుప్రకారం నేను యిదివరకే చెప్పినానండి. బండివాడు యెడ్లను కడుతూవున్నాడు.

రామా—(కరటకరెడ్డివంక చూచి) ఓరిదొంగా! నీవన్నీ ఇదివరకే యేర్పాటు చేసినావు! అందుచేతనేనా నేనువెళ్ళుమంటే వెళ్ళక యేమీయెఱగనట్టు నటిస్తూనిలుచున్నావు? ఎప్పుడో జరగబోయేదంతా నీవు ముందుగానే కనిపెట్టి అన్నీ చెప్పకమునుపే జాగ్రతపెడుతూ వున్నావే. అన్నీ సరేకాని తల్లియింటికాడ విచారిస్తూవుండకుండా నీకూతురు భద్రముగావున్నదని నీవు ముందుగా పోయి చెప్పిరావలెను. వేగిరంవెళ్ళు.

కర—ఈ వెంకణ్ణిపోయి చెప్పిరమ్మనరాదా?

రామా—ఈపనికి వెంకడు పనికిరాడు. వెంకణ్ణి వేరేపని మీద పంపవలెను. ఇందుకు నీవేతగినవాడవు. నీవుఅబద్ధాలు మహాబాగా చెప్పగలవు. నీశక్తిమఱియెవరికీరాదు. సమయోచితంగా నిమిషంలో కథకల్పించి నమ్మేటట్టుగా నీవు బొంకుతావు. వెంకా! నీవు పళ్ళెములో తమలపాకులువేసి పట్టుకునిరా.

కర—మీరు పూరికేనన్ను స్తుతిచేస్తూవున్నారు. ఈ వెంకడు నాకంటెనూ యెక్కువ అబద్ధాలు ఆడుతాడు. వీణ్ని పంపండి.

రామా—వీడయితే అబద్ధాలాడుతాడుకాని నీకుమల్లె కమ్మే ట్టుగా చెప్పలేడు. నీవు అబద్ధమాడినా నిజంకంటెనూ దివ్యంగా వుంటుంది.

కర—అవునుగానండి—

రామా—అవునూలేదు కాదూలేదు. మీరుఇద్దరూకూడా తక్షణంపొండి. (అని కన్ను లెఱ్ఱచేసి కోపపడి కేకలువేయుచున్నాడు)

వెంక—నేను వెళుతూవున్నాను. (అని పోవుచున్నాడు)

కర—(తనలో) నేను కార్యం చెడకొట్టకపోయినా రెడ్డిని కాను. నీవయితే నేను వెళ్ళిపోతాను. కులకవలెనని సంతోషిస్తూ వున్నావుకాని— (అని వెళ్లుచున్నాఁడు)

రామా—నీవంటి చక్కనిది భూలోకంలోలేదు.

మోహి—అయ్యో! మీస్తుతికి నేను తగినదాన్ని కాను.

రామా—ప్రియురాలా! నేను నెప్పినది వాస్తవముకాని స్తుతి కాదు. నీబుగ్గలొక్కసారి ముద్దు పెట్టుకోనిస్తావా?

కర—(మరల ప్రవేశించి తొందరచేత చేతిలోని తమల పాకులపళ్లెము క్రిందపడ వేయుచున్నాఁడు)

రామా—ఓరి నిర్భాగ్యుడా! ఈచిన్నదాన్నినిష్కారణముగా బెదరకొట్టినావు. పళ్లెము చప్పుడువిని వులికిపడి జడుసుకున్నది.

కర—అయ్యో—మీరుముద్దు—కాదు కాదు—నేనుపళ్ళెము—

రామా—(మిఠాయిపొట్లమువిప్పి, ఉండలు మోహినిచేతిలో పెట్టుచు) మోహినీ! కూరుచో — ఓరినిర్భాగ్యుడా! సిన్నుపోయి మోహినితల్లితో వర్తమానం చెప్పిరమ్మంటే మళ్ళీవచ్చినావేమి! నీవుబుద్ధిపూర్వకంగానే పళ్ళెంపడ వేసినావు.

కర—లేదు లేదు తమలపాకులు మీకు నేనుస్వయంగాతీసుకు రావలెనని వెంకడిని అక్కడకు పంపినాను. మిమ్మలినిచూడగానే చెయ్యివడుకె త్తి పళ్ళెంజారి పడిపోయింది.

మోహి—(తనలో) ఈసమయంలో మావాళ్ళు యెవరయి నావచ్చి చూచిపోతారేమో అని నాకుసిగ్గు వేస్తూవున్నది.

కర—(తనలో) నేను వీరినివిడిచి వక్కనిముషం అవతలకు వెళ్ళను. యేమిచేస్తారో చూతాము.

రామా—ప్రియురాలా! తినవేమి?

మోహి—మీరుచేసే ఆదరణచేతనూ గౌరవంచేతనూ నాకు ఆకలికనపడడం లేదు. (అని తినుచున్నది)

కర—(తనలో) అది మిఠాయివుండలు యేలాగు మింగుతూ వున్నదో దాన్ని చూస్తే నానోరు వూటలువూరుతూవున్నది.

రామా—కరటకా! ఆతమలపాకులు యిక్కడ పళ్ళెములో వుంచి యీమిఠాయివుండలు యీచిన్నదానికి అందిస్తూవుండు.

కర—(దగ్గరకువచ్చి పళ్ళెము బోర్లించుచున్నాడు)

రామా—ఓరినిర్భాగ్యుడా!నీకుమతిపోయినట్టువున్నదే. పళ్లెం బోర్లించినావేమి? అదితిన్నగాతీసి యీమిఠాయివుండ మోహిని కందియ్యి.

కర—(వుచ్చుకొని తానేతినుచున్నాడు)

రామా—ఓరి నిర్భాగ్యుడా! నీకు పిచ్చియెత్తినదా యేమి? (తనలో) దీని సౌందర్యంచూస్తే వీడికి ఆశకలుగుతూవున్నట్టున్నది. అయినా వీడిమనస్సు పరీక్షచేసి చూస్తాను. (ప్రకాశముగా) ఈమె సౌందర్యం వర్ణించడానికి శక్యమైనది కాదు.

కర— ఆరంభంలో అలాగేకనుపడుతుంది కానితరువాత—

రామా—ఆమందహాసము సొగసు చూచినావా!

కర—ఆపళ్ళు యికిలించడమా?

రామా—ఆ కళ్ళ అందము కనిపెట్టినావా?

కర— చికిలికళ్ళ—

రామా—నీవంటి గుడ్డివాళ్ళకాలాగే కనుపడతవికాని మా వంటి రసికులకు—

కర—(తనలో) ఈవ్యవహారంయింకా రెండు నిముషాలు యిలాగు జరుగుతూవుంటే నాకునిజంగానే పిచ్చియెత్తుతుంది.

రామా—ఓ మోహినీ! నీకు ప్రియులెందరున్నారు?

మోహి—ఒక్కడే.

రామా—ఒక్కడేనా? అతడుమిక్కిలిచక్కనివాడు కాబోలును.

మోహి—ఆరంభంలో ఆలాగేకనుపడుతాడుగాని తరువాత ఏమయినాఅంటే అతడు వంటిరిగా వున్నప్పుడు నన్నుకొడతాడేమో అని భయము వేస్తూవున్నది.

రామా—అతనికి నీమీద అనురాగంకూడా వున్నదా?

మోహి—యిప్పటిస్థితిచూస్తే అదికూడావున్నట్టే కనుపడుతూవున్నది.

కర—ఇప్పుడువెళ్ళి—(అని కాలు నేలతన్నుచున్నాడు.)

రామా—అదేమిటి?

కర—ఏమీలేదు. కాలుతిమ్మిరిగా వున్నది. (తనలో) ఇక నిజంచెప్పివేస్తాను.

రామా—నక్క కాలేకాదు నీకువళ్ళంతా తిమ్మిరిగావున్నట్టున్నది.

[అప్పుడు వెంకడు పరుగెత్తుకొని వచ్చుచున్నాడు.]

వెంక—అయ్యో! అమ్మగారు వస్తూవున్నారు.

రామా—ఏఅమ్మగారు రా?

మోహి— మాఅమ్మ వస్తూవున్నదా?

వెంక—యేఅమ్మ గారా? యేలినవారి భార్యాగారు. శ్యామలాంబగారు. నేను వెళుతూవుండగా అమ్మగారిబండి యెదురుగావస్తే నేను వెనక్కు పరుగెత్తుకోని వచ్చినాను.

కర—ఇక నేను బ్రతికినాను. నాకు మళ్ళీ ప్రాణాలువస్తూవున్నవి.

రామా—మీరు యీ ఆకులూ అన్నీ తీసివెయ్యండి. వేగిరం కరటకా! నీవీదొడ్డితలుపుతీసి మోహినిని యింటికి పంపించివెయ్యి. (అని తలుపువద్దకు పరుగెత్తుకోనిపోయి) ఈపెరటితలుపు తాళము వేసియున్నది. కరటకా! తాళంచెవి యేదీ?

కర—తాళంచెవా?

రామా—అవును. తాళంచెవి వేగిరం ఇయ్యి.

కర—(దేహము తడవుకోనుచు) తాళముచెవి పోయింది.

రామా—అయ్యో! ఇప్పుడేమిచెయ్యను?నాకుఅసాధ్యం వచ్చినది. నాభార్య బండిదిగి వస్తూవున్నది. కరటకా! నీవీచిన్నదాన్ని యిప్పుడీవసారాలోకి తీసుకుని వెళ్లు. నేనుయెదురుగావెళ్ళి నాభార్యను తీసుకోనివస్తాను.

కర—మంచిది. (అని మోహినితో వసారాలోకి పోవుచున్నాడు.)

[అప్పుడు శ్యామలాంబ ప్రవేశింపఁగా, రామాకాంతముపంతులెదురుగాపోవుచున్నాఁడు. మోహినిని విడిచి కరటకరెడ్డి వచ్చుచున్నాఁడు.]

శ్యామ—ఓ ప్రాణేశ్వరా! మీకు తెలివివచ్చినదా? నేను మిమ్మల్ని చూడనేమోనని యేడుస్తూవచ్చినాను.

రామా—ఈసోదియేమిటి? నివ్వు ఇప్పుడు పడిపోయినట్టు వంటరిగాయెందుకు వచ్చినావు?

శ్యామ—మీరుదాచఁబోకండి. మీకథంతా నేనువిన్నాను సుమా.

రామా—(తనలో) మోహినిమాట యెవరూ చెప్పలేదుగద. (ప్రకాశముగా) కథంతా విన్నావా? ఏకథవిన్నావు?

శ్యామ—తాచుపాముకాటు బ్రతికినా చచ్చినా నాలుగు ఝాములలో తెలుస్తుంది. నాకు భూమిలో పసుపు కుంకుమూ పెట్టుకొని అయిదోతనం చెయ్యవలసినయోగంవున్నదిగనుక నాపుణ్యంచేత మీరు సజీవులయి తేరుకున్నారు. మీరుచెప్పకపోయినా నాకు యీవుత్తరంచెప్పినది. (అని వుత్తరం చేతికిచ్చుచున్నది.)

రామా—(ఉత్తరము పుచ్చుకొని చదువుచు) ఎవడురా యీ వుత్తరంవ్రాసినదుర్మార్గుడు? నాకు రాత్రితోటలో తాచుపాము కరచిందట! నేను స్పృహ తెలియకుండా పడివున్నానట! నేను బ్రతుకుతానో లేదో తెలియదట! దీనికింద దస్కతులేదు. కరటకా! యీ దస్తూరీయెవరిదో నీవు చెప్పగలవా! (అని చూపుచున్నాఁడు.)

కర—యీదస్తూరీ నాకేమెంతమాత్రము తెలియదు. ఇది కొత్తవ్రాత. (తనలో) తన పెళ్ళాముతో యీయన తిరగడానికి వేగలేక గుమాస్తా భీమారావూ నేనూ కలిసివ్రాసినవుత్తరం వూరికేపోలేదు. తగినపని చేసింది.

శ్యామ—అది దొంగవుత్తరమయినందుకు నాకు సంతోషంగా వున్నది. మీకేమీతొందర కలుగ లేదుగదా?

కర—పాముకాటు మహాచెడ్డది. దానివల్ల యెంత అపాయమయినా వున్నది. ఈయన యెప్పుడూ భార్యనువిడిచి వంటిగా వుండకూడదు.

శ్యామ—నీవు కూడావున్నతరువాత భార్యలేనిలోపం వుండదు. ఇటువంటిది ముందు యెప్పుడయినా మళ్ళీతటస్థిస్తే నాకు ముందుగా వర్తమానము పంపుమా.

కర—తప్పకుండా పంపుతాను. ఇక నాలుగురోజులకు తటస్థ మవుతుందనగానే మనిషినిపంపుతాను.

రామా—అయినద్దానికి విచారించిన కార్యములేదు. మనము లోపలకు వెళుదాము రా. (కరకటరెడ్డితో రహస్యంగా) మేము వెళ్ళగానే మోహినిని అవతలికి పంపివెయ్యి.

శ్యామ—నాకు చెమటపట్టింది. లోపలికిరాను. కొంచెము సేపు చల్లగాలికి యీవసారాలో మల్లిపందిరిదగ్గిర కూర్చుంటాను. నామల్లిచెట్టుకు రోజూనీళ్ళుపోయిస్తూవున్నారా?

రామా—వసారాలోకా?

శ్యామ—వసారాలోకే వెళుతాను.

రామా—(కరటకరెడ్డితో రహస్యంగా) నీవేదో మాయో పాయం కల్పించి బొంకవలెను. తక్షణం యేదో అబద్ధంకల్పించి నామానందక్కించు.

కర—అమ్మా! వసారాలో యెవరున్నారో మీకు తెలియదు. నన్ను క్షమించవలెను.

శ్యామ—వసారాలోయెవరున్నారు? నిన్ను క్షమించడానికి యేంనేరంచేసినావు?

కర—ఒక చక్కనిచిన్నదాన్ని నేను తీసుకొనివచ్చి—

రామా—(తనలో) వీడునాగుట్టు బయలపెడుతూవున్నాడు—

శ్యామ—ఏమీ! నేనులేనిసమయంలో నాయింటికిఆడదాన్ని తెచ్చినావా?

రామా—(కోపముతో) చక్కనిచిన్నదాన్నా? కానీ చెప్పు చెప్పు.

కర—నేను చెప్పేది చివరదాకావినండి. నాకుచెప్పడానికి సిగ్గువేస్తూవున్నది. మీయిద్దరికీ కోపం తెప్పించడానికి కారణమయిన అనిర్దోషురాలు నాపెళ్ళాము.

రామా—నీభార్యా?

శ్యామ—నీ పెళ్ళామా?

కర—అవును నాపెళ్ళామే. పంతులుగారు మీనిమిత్తమయి మంచిదాసీని కుదుర్చుమని నాతోచెపితే నాపెళ్ళాము పెద్దమనిషీ వళ్ళువంచి పనిచేసేదీ అని తీసుకుని వచ్చినాను. అమ్మగారుకొన్నాళ్లు చూచి తమ మనసువచ్చినట్టు పనిచేసేదనితోస్తే జీతంనిర్ణయించి భార్యాభర్తల నిద్దరినీ పోషించేభారమే మీది.

రామా—(తనలో) వీడు బహుబాగాబొంకినాడు. ఇందులో వీడుచెప్పినది వక్కక్షరమయినా నిజంకాదనడానికి లేశమయినా అవకాశములేదు.

శ్యామ—నాకోసము శ్రమపుచ్చుకొని మీరు దాసీ నిమిత్తమయి యింతప్రయత్నంచేసినందుకు నాకు సంతోషంగావున్నది. కరటకా! యేదీ నీభార్యను నాకు చూపించు.

కర—రండివెళ్ళిచూతాము. (కరటకరెడ్డియు శ్యామలాంబయు పోవుచున్నారు.)

రామా—ఔరా! రెడ్డీ! యెంతచక్కగా బొంకినావురా? నాకదివరకు నిజం తెలిసివుండక పోయినట్లయితే చెప్పినదంతా నేనూ నమ్ముదును. వీడు నిముషంలో ఆకొత్తదాన్ని పెళ్ళాముగా మార్చివేసినాడు. యెలాగయినా యీ అపూర్వవివాహంవల్ల మాదంపతులకు కలహం తప్పిపోయింది. నేటికి నేను బ్రతికినాను.

(శ్యామలాంబ ప్రవేశించుచున్నది.)

శ్యామ—నేను మనరెడ్డిపెళ్ళామును చూచినాను. దానివద్ద వినయమూ, తెలివీ కావలసినంత వున్నవి. అది శూద్రదయినా

యెంతో చక్కగా మాటాడినది. దానికపటంలేని మాటలువింటే నాకు బహుసంతోషమయినది.

రామా—అది నీమనసుకు నచ్చినదిగద?

శ్యామ—చివరకు నాకుమంచిదాసీ దొరికింది. మనరెడ్డి దానిమీద ప్రాణములు విడుస్తూవున్నాడు. మొగుడూ పెళ్ళామూ యిద్దరూ మనయిల్లు కనిపెట్టుకువుంటారు. వాళ్ళ అనురాగమూ ఐకమత్యమూ చూస్తే నాకు ముచ్చటవుతూవున్నది.

రామా—(తనలో) వాడు యెంతసేపటికీ కదలిరాకుండా వున్నాడు. దొడ్లో దానితో యేమిచేస్తూవున్నాడు?

శ్యామ—యీ అద్దంలో వాళ్ళు కనపడుతూవున్నారు. మన రెడ్డిపెళ్లామును యెలాముద్దుపెట్టుకుంటూవున్నాడో!

రామా—పట్టపగలు ఆడదాన్ని వాడలాచెయ్యడం నీకు యిష్టముగావున్నదా?

శ్యామ—మొగుడు పెళ్లామును ముద్దుపెట్టుకుంటే అందులో తప్పేంవున్నది?

రామా—తప్పితం లేదుగాని నేను వక్కమాటు కరటక రెడ్డిని కూకలు వెయ్యవలెను. నీవవతలకుపో.

శ్యామ—పెళ్ళామును ముద్దుపెట్టుకొన్నందుకు కాదుగద?

రామా—అందుకోసము కాదు. మరొకందుకు కూకలు వేస్తాను.

శ్యామ—అలాగైతే నేను లోపలికిపోయి వాళ్ళుకాపురం వుండడానికి దంపుళ్ళగది చోటుచేయించివస్తాను. (అని వెళ్లుచున్నది.)

(అప్పుడు కరటకరెడ్డి ప్రవేశించుచున్నాడు.)

రామా—అప్పుడే మీరు రావడానికి తీరుబడిఅయిందీ యింతవేగిరం దయచేశారేమి?

కర—(శ్యామలాంబకు వినఁబడునట్లు బిగ్గరగా) క్షమించండి నాభార్యతో—

రామా—(మెల్లగా) నీభార్యా?

కర—అవును నాభార్యా. అమ్మగారుదాన్ని తమపనికత్తెగా వుంచుకోవడానికి వప్పకున్నారుగనుక, ఆమెవద్ద యేలాగునడుచుకోవలెనో దానికి బుద్ధిచెవుతూవున్నాను. మీరు మెరుగుదురు గదాండి—

రామా—నీవు వట్టి ఘూటాకోరువని నేను మెరుగఁదును. ఇలాగంటి పనులు చెయ్యకుండా నిన్నుగుఱ్ఱవుకొరడాతో వీపుబద్దలు కొట్టవలెను.

కర—ఈపరియాచకం బాగా నేవున్నది.

రామా—బాగా నేవుంటుంది. తెలివితక్కువదాన్ని చేసి నీవా చిన్నదాన్ని చెరపడానికి చూస్తూవున్నావు. మాయింట్లో యిటువంటి నీతిమాలినపనులు యెంతమాత్రమూ పనికిరావు.

కర—దైవముతోడు! నిజముగా అది—

రామా—నావద్ద నీఅబద్ధపు ప్రమాణాలూ గిమాణాలూ సాగవు. నీవాచిన్నదాన్ని యెందుకు ముద్దుపెట్టుకున్నావో చెప్పు.

కర—(తనలో) యెవరూ లేనప్పుడు నేను రహస్యంగా ముద్దు పెట్టుకున్న సంగతి యితనితో యెవరుచెప్పినారో. ఓయి దేవుడా! ఇక్కడ గోడలకుకూడా చెవులు వున్నవికదా?

రామా—నీవుమళ్లీ యేదో పెద్దఅబద్ధమాడడాని కాలోచిస్తూ వున్నావు. నీమాటలకు నేను మోసపోను.

కర—నేను అబద్ధం యెంతమాత్రమూ ఆడను. నిజంగా నేను మోహినిని ముద్దుపెట్టుకున్నాను. మీరు నమ్మినాసరే నమ్మక పోయినాసరే నిజంచెప్పినాను.

రామా—యెందుకు పెట్టుకున్నావు?

కర—మీకోసమే ముద్దుపెట్టుకున్నాను. అమ్మగారి మనస్సులో మీయందుండే అనుమానంపోగొట్టడానికి నేనాపనిచేసినాను. నేనుచేసినపని మీక్షేమంనిమిత్తమే కాని నానిమిత్తంకాదు. సేవకులు యజమానుల నిమిత్తమయి యెంతపనిచేసినా వారికి మెప్పు కనుపడదు.

రామా—ఆముద్దు నాకోసంకాకుండ నీకోసమే పెట్టుకున్నావని నాకుయిప్పటికీ అనుమానము బాధిస్తూనేవున్నది. అదుగో మోహిని యిలాగేవస్తూవున్నది. నేను లోపలికిపోయి యీతలుపు కంతలోనుంచి మీయిద్దరిచర్యలూ కనిపెడుతూవుంటాను. నీవునన్ను మోసం చెయ్యలేవు.

కర—అయ్యో! మోహిని వకవేళవచ్చి మోహించి నన్నుయేమయినాచేస్తే, అదీ నాతప్పితమేనా? ఆడవాళ్ళువచ్చి యెదుట నిలవబడ్డప్పుడు మగవాళ్ళు మనసుపట్టలేరు. మీవిషయంలోనాశాయశక్తులా పనిచేస్తానుగాని వకవేళ ఆచిన్నది తనంతటవచ్చి నన్ను—

రామా—దానికి ఫర్వాలేదు. నీవుమాత్రం మళ్ళీయెప్పుడూ ముద్దుపెట్టుకోకూడదు. యీసారి నీవు మళ్ళీముద్దుపెట్టుకున్నట్టయితే నిన్నుగుర్రపుకొరడాతో చావగొట్టి మాయింట్లోనుంచి సాగనంపుతాను. (అని లోపలికిపోయి తొంగిచూచుచున్నాఁడు.)

[మోహిని ప్రవేశించుచున్నది.]

మోహి—ఆమె బహుదొడ్డయిల్లాలు. యికమనరహస్యం మానివేసి మనంయిక్కడ సుఖంగావుండవచ్చును.

కర—మెల్లిగామాట్లాడు! మెల్లిగా. (తనలో) ఇదియెంత సౌంజ్ఞచేసి చెప్పినా మెల్లిగా మాట్లాడకుండావున్నది. నేనుజవాబు చెపితే నాపనిపోతుంది. చెప్పకుండావుంటే పెళ్ళాముపోతుంది. నాకంతా అసాధ్యంగానేవున్నది.

మోహి—నీవునా మొగుడవని నేనిప్పుడందరితోనూ చెప్పవచ్చును.

కర—(నవ్వుచు) నీ మొగుడా! ఈహాస్యం కొంచెంసేపు చాలించు. అదియెల్లప్పుడూ పనికిరాదు.

మోహి—నీవు నాకు మొగుడవడం హాస్యమా? ఇన్నాళ్ళనుంచీ మనం మొగుడూ పెళ్ళామూ కావడమంతా యిప్పుడు హాస్యమయిపోయిందీ? (అని మొగమునకు కొంగడ్డము పెట్టుకొని యేడ్చుచు) మంచిది యిప్పుడు నీవునన్ను విడిచి పెడితే నాకు మొగుళ్ళు దొరక్కపోరులే. నాకు యిలాగంటి మొగుళ్ళు లక్షమంది దొరుకుతారు. నీవు వదిలిపెడితే రేపుయీపాటికి నేను విధవావివాహం చేసుకుంటాను చూడు.

కర—(తనలో) నేనుయిప్పుడు దీన్నిసముదాయించక పోయినట్టయితే కార్యంచెడుతుంది. (తనయజమానుఁడాగదిలోనున్నాఁడని సైగచేయుచు మెల్లగా) నేను నీపెనిమిటినే. అందుకు సందేహములేదు. కాని నాయజమానుడు—నేను స్వతంత్రుణ్ణి అయితే—క్షమించు తెలిసిందా?

మోహి—నాకుతిన్నగా తెలిసింది కాదు కాని వక్కముద్దుపెట్టు క్షమిస్తాను.

కర—(తలుపు కేసిచూచి తనలో) నేను చొరవచేసి వక్కముద్దుపెట్టుకుంటాను.

మోహి—యేమి యింకాముద్దుపెట్టుకోవడానికే అనుమానిస్తావున్నావేమి? పోనీ! నేను యిప్పుడుపోయి నీదుర్మార్గమంతా అమ్మగారితో మనవిచేస్తాను.

కర—ఓభగవంతుడా!

మోహి—నేనుపంతులుగారితోకూడా చెప్పతాను. ఆయన బహుదొడ్డవాడు. నీవలె నన్నాయన అనాదారణచెయ్యడు;

[శ్యామలాంబ ప్రవేశించుచున్నది.]

శ్యామ—ఏమిటి? మీ లో మీ ర ప్పు డే తగువులాడుతూ వున్నారా?

కర—అమ్మా! తప్పితందానిది కాని నాది కాదు.

మోహి—అమ్మా! తప్పితమంతా ఇతనిదే. నేను తనకు ముద్దియ్యబోతే పుచ్చుకున్నాడు కాడు.

శ్యామ—యేమిటి? పెళ్ళాము ప్రేమతో ముద్దుయిస్తే, పుచ్చుకున్నావు కావా? ఏదీ యిప్పుడు నాయెదుట ముద్దుపెట్టుకో.

కర—(తలుపు కేసి చూచి) యిఖ నాతప్పితం లేదు. (అని ముద్దుపెట్టుకొని) మోహినీ! జరిగిపోయినది మరిచిపో. యిఖ నేను నీవు చెప్పినట్టు వింటాను.

రామా—(తలుపు తీసికొని వచ్చి కోపముతో) నేను యింత దూరము చెప్పినా నిర్భయంగా నీవు మళ్ళీ ముద్దుపెట్టుకున్నావుగా!

మోహి—అయ్యా! నాపెనిమిటిమీద కోపపడకండి.

రామా—(తనలో) పెనిమిటా? ఇదికూడా హాస్యానికన్న మాటే నిజంచేస్తూవున్నదే. (ప్రకాశముగా) నేను యిప్పుడు వీడి పని తీసివేస్తాను.

శ్యామ—మీరు నిష్కారణంగా పనితీసివెయ్యకూడదు.

రామా—నిష్కారణంగా కాదు. కావలసినంత కారణం వున్నది. ఆ కారణమేమో రెడ్డికే తెలుసును.

కర—నాకా? నాకు యేకారణమూ తెలియదు.

రామా—నీకు కారణమేమీ తెలియదుగా?

శ్యామ—రెడ్డీ! నీవు మారుమాటయేమీ చెప్పవద్దు. మీ దంపతులు యిద్దరూ దంపుళ్ళగదిలోకిపొండి. నేను తరువాత ఈయనను సమాధానం చేస్తాను.

మోహి—రెడ్డీ! వెళుదాముర.

శ్యామ—మీరు నిజముగానే వీళ్ళను పంపించివేస్తారా?

రామా—నేను కాదు నీవే పంపించివేస్తావు. నిజం చెప్పవలసినట్టయితే వాళ్ళిద్దరూ మొగుడూ పెళ్ళాలు కారు.

శ్యామ—కారా?

రామా—కారు.

మోహి—(మగనితో) మనకు వివాహమయిన సంగతి యీయనకు తెలియనే లేదా?

కర—పూరుకో.

శ్యామ—నాకేమీయు తెలియకుండావున్నది. వాళ్ళిద్దరూ కూడా మహామంచి వాళ్ళుగా కనపడుతూవున్నారే.

రామా—పయికి మంచివాళ్ళుగానే కనపడుతూ వున్నారు. వాళ్ళు నిజంగా భార్యాభర్తలయితే వాళ్ళను వెళ్ళగొట్టడానికి నాకు మాత్రం యిష్టంవుంటుందా?

కర—మేము పెళ్ళిచేసుకున్న మొగుడూ పెళ్ళాలమయిన మాట నిజమయినట్టయితే మమ్మల్ని వెళ్ళగొట్టడం మీకు యిష్టం లేదుగద! అలాగయితే దీని నిజమంతా ఆవచ్చే శాస్త్రుల్లుగారు చెపుతారు. ఆయనను అడగండి.

[అప్పుడు సోమభట్లు ప్రవేశించుచున్నాడు]

రామా—అయ్యా సోమభట్లుగారూ! నమస్కారము. మీరు యేంపనిమీద వచ్చినారు?

సోమ—ఈరోజున మీతండ్రిగారి తిథిప్రయోజనము. నిన్నటి రాత్రినుంచీ మీకోసం తిరుగుతూవుంటే మీదర్శన మయిందికాదు. పుదయమయిన తరువాత నాలుగు మాట్లు యిక్కడకు వచ్చినాను. మీరు పంటిఘంటవరకూ యింటికే రాలేదు.

రామా—అవును మా ఆడవాళ్లు వూళ్లో లేకపోవడంచేత మా బంధువులయింట్లో భోజనంచేసినాను. మీరుయీసంగతి యెక్కడా చెప్పబోకండి. అంతగా కావలిస్తే తద్దినం రేపుపుదయాన్న పెడుదాము.

సోమ—చిత్తము. అలాగే కానిత్తాము. నాకు నాలుగురోజులలో తూర్పువెళ్ళవలసిన పనివున్నది. వెళ్ళితే నాలుగునెలలదాకా రానండి. ఈలోగా తమలోపలవచ్చే కార్యాలు మరీయేమీ లేవు.

శ్యామ—ఏమయ్యా బ్రాహ్మడా! నీకు వూరికివెళ్ళవలసిన పనివున్నదని యింత కక్కుర్తిపడుతావు? మామామగారుపోయింది వైశాఖమాసమయితే యీచైత్రమాసంలో తద్దినం యెలాగువస్తుందయ్యా?

సోమ—అమ్మగారూ! కోపంపడకండి. నేనుపంచాంగం పొరపాటుగా చూచినాను కాబోలును. మళ్ళీవెళ్ళి తద్దినాలజాబితా తిన్నగా చూచివస్తాను. (అనిపోబోవుచున్నాడు.)

కర—(ఆపి) అయ్యా! మీరుమాయిద్దరికీ పెళ్ళిచేయించిన సంగతి యీయనతో వక్కసారి చెప్పిమరీపొండి.

సోమ—అవును అందులో యేమితగాదావున్నది? నేనుమంత్రాలు తిన్నగా చెప్పలేదని యెవరయినా ఆక్షేపణ చేసినా నాయేమిటి? శూద్రపెళ్ళి పురాణోక్తం గనుక మంత్రాలక్కరలేదు.

రామా—వీళ్ళకు మీరు పెళ్లియెప్పుడుచేయించినారు?

సోమ—రెండుసంవత్సరాలకిందట చేయించినాను.

రామా—కరటకా! నీవు రెండుసంవత్సరాలనుండి గృహస్థువైవుండిన్నీ నావద్ద బ్రహ్మచారివిగానే నటించినావా?

కర—నేనువూరికే బ్రహ్మచారిగా నటించడంమాత్రమే కాని నిజానికి సంసార సుఖాలన్నీ అనుభవిస్తూనే వున్నాను. లోకంలో

అనేకులు పేరుకు గృహస్థులమని నటిస్తూవున్నా మీదయవల్ల సంసార సుఖంలేకుండా నిజమయిన బ్రహ్మచారులుగానే వున్నారు. అసంగతి దేవరవారికే విశదము.

రామా—అసంగతి నీవుచెప్పనక్కరలేదు. నీవుదీన్ని పెళ్లాడినమాట నిజమేనా!

కర—నిజమే. ముమ్మాటికీ నిజమే.

రామా—అన్నీ అబద్ధాలాడేవాడవు. నీవుయిందులోమాత్రం నిజంచెప్పివుంటావా?

కర—యీవేళ నేను నిజంచెప్పడానికి ఆరంభంచేసినాను. దేవరవారు నేను యీగృహస్థ బ్రహ్మచారినిగా వుండవలసిన ఆవశ్యకంలేకుండాచేస్తే నేను నేటినుంచి సత్యహరిశ్చంద్రుణ్నే అవుతాను.

రామా—కరటకా! ఇందాకటి నీఅవస్థలుచూస్తుంటే నాకు నవ్వువస్తూవున్నది. ఇప్పుడు జరిగినదంతా మరిచిపోయి మీరు యిద్దరూ యీమాయింట్లో సుఖముగా వుండవచ్చును. నేను యిక ముందు నీవుచెప్పిన గృహస్థబ్రహ్మచారులను నిజమైన గృహస్థులనుగా చెయ్యడానికే ప్రయత్నంచేస్తాను. లోపలికిపోదామురండి.

కర—అలాగయితే మాకు యిదివరకు జరిగినవివాహం వివాహంకాదు. ఇప్పుడు మీరు జరిగించినదే వివాహము. నాబ్రహ్మచర్యంవదలి మీదయవల్ల నేను యిప్పుడు నిజమయిన గృహస్థునవుతూవున్నాను.

[అందరు నిష్క్రమించుచున్నారు.]

బాక్సుప్రెస్, రాజమండ్రి-1950

విచిత్ర వివాహ ప్రహసనము

రచయిత:

కందుకూరి-వీరేశలింగము

ప్రకాశకులు:

హితకారిణీసమాజము,

రాజమహేంద్రవరము.

1950.

[వెల రు. 0-5-0

విచిత్రవివాహప్రహసనము

ఇందువచ్చు పాత్రములు.

ధనకోటిరాజు—హైకోర్టువకీలు.

వెంకటపతిరాజు—ధనకోటిరాజుగారి అన్నకుమారుడు.

తిమ్మయ్య—ధనకోటిరాజుగారిభటుడు.

మోహినీదేవి—రతిసుందరి మేనత్త.

రతిసుందరి—మోహినీదేవి మేనకోడలు.

రంగము—చెన్నపట్టణము, ధనకోటిరాజుగారి కచేరీగది.

[వ్రాతబల్లవద్ద కూరుచుండి వెంకటపతిరాజు ప్రవేశించుచున్నాడు.]

వెంక—(బల్లమీద కాగితములును కలమును క్రిందకు త్రోసివైచి కోపముతో) వెధవపని. నేను యిక యీపని చూడను. యెన్నిమాట్లు అడిగినా చిన్నాయన పెండ్లికి యిప్పు డేమితొందర వచ్చిందంటాడు: నాకు యిప్పుడు యిరువైయేళ్ళు కావచ్చినవి. బియ్యే ప్యాసయినాను. యింకా యెన్నాళ్ళు బ్రహ్మచర్య చేస్తాను? చిన్నాయెన వచ్చినతర్వాత యీమాటు స్పష్టంగా అడిగి, పెళ్ళి చేయనంటే దేశాంతరం లేచిపోతాను. గుమస్తా లేకుండా యీబండపని నేను చేస్తూ కూర్చుంటానా? (అని కలము క్రిందవేసికొట్టుచున్నాడు.)

[ఇంతలో ధనకోటిరాజు ప్రవేశించుచున్నాడు.]

ధన—ఓరినిర్భాగ్యుడా! కాగితాలన్నీఅలా క్రిందవేసినావేమిరా?

వేంక — నేను యీపని నేర్చుకోను. నాకు ప్లీడరీపనియందు యిష్టములేదు.

ధన — నీవు వట్టికోతివి. నీకు యేపనియందూ యిష్టం లేదు.

వేంక — నీవు నాచేత ప్రొద్దున్న మొదలుకొని సాయంత్రం దాకా వట్టివెట్టిపని చేయిస్తావు. నేను చేయలేను.

ధన — పనిపాటలు లేకుండా పూరికే సోమరిగా కూర్చుండి భోజనం చెయ్యగలవా?

వేంక — యిదివరదాకా చూచినట్టు నన్ను యిక పిల్లవాణ్ణిగా చూస్తే పనికిరాదు. నేను యిప్పుడు పెద్దవాణ్ణి అయినాను.

ధన — అయితే యేమంటావు?

వేంక — నేను మీఅన్నగారి కొడుకును గానా!

ధన — అయితే?

వేంక — అయితే గియితే అంటే పనికిరాదు. నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి. మీదగ్గర డబ్బువున్నదా లేదా?

ధన — ఇప్పుడు నాడబ్బుసంగతి నీ కెందుకు?

వేంక — నన్ను మళ్ళీ ప్రశ్నలు వెయ్యక నేను అడిగిన ప్రశ్నకు వుత్తరం చెప్పండి. మీరు భాగ్యవంతు లవుదురా కారా? జవాబు చెప్పండి.

ధన — (కోపముతో) నేను భాగ్యవంతుణ్ణి కాను. నీకు యిప్పుడు కావలసింది యేమిటి?

వేంక — నాకు కావలసిందా? మొట్టమొదట మీరు మీఆఫీసు పని చూడడానికి వేరే గుమస్తాను పెట్టుకోండి. అటుతరువాత మీఆస్తిలో నాకు భాగం పంచిపెట్టండి.

ధన — నాది స్వార్జితం. నీకు భాగం యెట్లావస్తుంది?

వేంక—ఈమధ్య హైకోర్టువారు ప్లీడరీవుద్యోగంవల్ల సంపా దించినదానిలో భాగం వస్తుందని తీర్పుచెప్పినారు.

ధన—(తనలో) వీడు సామాన్యుడు కాడు. (బిగ్గరగా) పని చేసినందుకు నీకు మంచిజీతం యిస్తానులే.

వేంక—జీతమా? వెధవజీతం. నీవుజీతం యివ్వకపోతే నాకు అన్నానికీ బట్టకూ జరగదా?

ధన—అన్నమూ బట్టాకంటే నీకు యింకా యేమికావలెను?

వేంక—యేమికావలెనా? నాకు పెళ్ళాము కావలెను.

ధన—(ఉలికిపడి)ఏమికావలయునూ?

వేంక—పెళ్ళాము.

ధన—పెళ్ళామూ?

వేంక—అవును. పెళ్ళామే. నాకు పెళ్ళిఅయినా చెయ్యండి. లేకపోతే నేను గృహస్థాశ్రమంలో ప్రవేశించి సుఖజీవనం చెయ్యడానికి తగినంత సొమ్మయినా యివ్వండి.

ధన—నీకు పెళ్ళికి సొమ్ము యివ్వవలెనుగా?

వేంక—నేను పెళ్లాడటం మీకు యిష్టం లేదా?

ధన—(కోపదృష్టితో) లేదు. లేదు. ముమ్మాటికీ లేదు.

వేంక—అలా కోపపడడం మీకు ధర్మం కాదు.

ధన—ఓరి దౌర్భాగ్యుడా! నీకప్పుడే భార్య కావలెనేమి? భార్యను యేమిచేసుకుంటావు? నాభార్య పోయి అంతకాలముయింది నేను మళ్ళీ భార్యను చేసుకోలేదు. భార్యా? ఆమాట తలుచుకుంటే నాకు భయం వేస్తూవున్నది.

వేంక—భార్యా అంటే భయమా? సంతోషమని మీఅభి ప్రాయం కాబోలు. యింట్లో భార్యా వుంటే యెంతసంతోషంగా

వుంటుంది.

ధన—సంతోషం గాదు దుఃఖంగానే వుంటుంది. ఇదంతా నేను స్వానుభవంమీద చెపుతూవున్నాను. ఆడవాళ్ళు బహుగయ్యాళి గంపలు. భార్యా రావడం అనే ఆపద పగవాడికయినా కోరకూడదు. పిల్లవాళ్ళూ బుద్ధిహీనులూతప్ప మరియెవరూ పెళ్ళి కావలెననికోరరు.

వెంక—మీాలుబ్ధత్వం చేతనే బ్రతికివున్న కాలంలో మాపిన్ని గయ్యాళిదయి పోయింది. దాన్నిబట్టి ఆడవాళ్ళందరూ గయ్యాళివాళ్ళనడం న్యాయం కాదు. ఇప్పుడు మీారు స్త్రీలు మంచివాళ్ళుకారని యెంత దూషిస్తూవున్నా, మీారుకూడా యెప్పుడో స్త్రీలవలలో పడి పెళ్ళి కావలెనని కోరేకాలం వస్తుందికాని రాకపోదు లెండి.

ధన—నేను పెళ్ళి కావలెనని కోరేకాలమా? యెన్నటికిన్నీ రాదు. నేను భార్య కావలెనని కోరేటంత గాడిదనైతే, అప్పుడు నేను నీకు—

వెంక—అప్పుడు నాకు యేమి యిస్తారు ?

ధన—ఏమయినా యిస్తాను.

వెంక—ఇరువై వేలరూపాయలు యిస్తారా?

ధన—తప్పకుండా యిస్తాను.

వెంక—నాకేనా?

ధన—నీకే యిస్తాను.

వెంక—అన్నమాట తిరిగిపోకూడదు సుమాండీ.

ధన—నేను యెప్పుడూ తిరిగిపోను.

వెంక—చేతిలో చెయ్యి వెయ్యండి.

ధన—ఇదిగో వేస్తాను.

(అని చేతిలో చేయివేయుచున్నాడు)

వేంక—అలాగయితే నేను వివాహం కావడం మీకు బొత్తిగా యిష్టం లేదా ?

ధన—ఎంతమాత్రమూ యిష్టము లేదు. అయినా ఆలోచించి చెప్తాను. ఒక్కనిముషం తాళు (ఆలోచించి) ఒక్కలాగైతే నీవివాహానికి నేను యిష్టపడుతాను.

వేంక—(ఆసతో) ఎలాగయితే పడుతారు ?

ధన—నీవు వివాహమాడబోయే చిన్నది యిరవైవేలరూపాయలు అరణం తీసుకుని వచ్చేదయితే నేను యిష్టపడుతాను. ఇఖ యిప్పటి కీప్రసంగం చాలించి, నేను ఘంటసేపట్లో మళ్ళీ వస్తాను. అందాకా పని చూస్తూవుండు. (అని వెళ్ళుచున్నాడు.)

వేంక—యింత నడివయస్సులో స్త్రీలవిషయమయి యితని మనస్సు చలించకుండా వుండడంచూస్తే, యితణ్ని సృష్టించేటప్పుడు బ్రహ్మదేవుడు యితనిహృదయం రాతితోనో యినుముతోనో చేశాడని తోస్తుంది. ఓరతిసుందరీ ! నాపినతండ్రిప్రతిజ్ఞ విన్నట్టయితే నీవు యెంత విచారిస్తావో ! ఓహృదయేశ్వరీ ! నేను యేమి చెయ్యను ? అతని యిష్టం లేకుండా నిన్ను నేను యెలాగు పెళ్ళిచేసుకోగలను ? (అని లేచి యిటు నటు తిరుగుచు) యెవరో వస్తూవున్నారు. యెవరయి వుందురు ? (కిటికీలోనుండి చూచి) ఆమే. అవును. కాదు. ఆమెకాదు. అవును ఆమే. ఆవచ్చేది తప్పకుండా రతిసుందరి మేనత్త అయిన మోహినీదేవే. యీమె రతిసుందరికి తండ్రితోడబుట్టిన దయినా, మంచిస్వభావముగలది గనుక మేనకోడలి సౌఖ్యంనిమిత్తమయి యేకష్టాలయినా పడుతుంది. (అని తలుపువద్దకు వెళ్ళి) మోహినీదేవీ ! అమ్మా ! లోపలికి రా.

[అప్పుడు మోహినీదేవి ప్రవేశించుచున్నది.]

మోహి—(మెల్లగా) మీ పినతండ్రిగా రెక్కడ వున్నారు?

వేంక—ఆగదిలోయేదో జరూరుపనిచూచుకొంటూ వున్నాడు.

(అని చూపుచున్నాఁడు)

మోహి—అలాగయితే మనకార్యం మనం వేగిరం చూచుకోవలెను నీవన్నప్రకారంగా నీవీవేళ యెందుకురాలేదో తెలుసుకుని రమ్మని రతిసుందరి నన్నుపంపినది.

వేంక—అయ్యో! మోహినీదేవీ! నాకు బహువిచారంగా వున్నది. రతిసుందరీ! నాప్రియురాలా! యీవార్త వింటే నీ వెంతదుఃఖ స్తావోకదా! యీవేళ అంతాఫరిష్కారమయింది. రతిసుందరీ నేనూ సుఖపడేయోగం దాటిపోయింది.

మోహి—ఎందుచేత? నీమాటలతాత్పర్యం యేమిటో నాకు తెలియకుండా వున్నది.

వేంక—మాచిన్నాయన యిప్పుడు నాపెళ్ళికి వప్పుకున్నాఁడు కాఁడు.

మోహి—ఎందుచేత? అతనికి యిన్నియేళ్ళువచ్చినా వివేకం లేకుండా కేవల పశువుగా వున్నాడే. తాను పెళ్ళాడలేదని అందరికీ పెళ్ళి అక్కరలే దంటాడా?

వేంక—మాచిన్నాయన తాను యెవరో అయితేనేకాని పెళ్లాడడం తటస్థించ దన్నాడు. ఆపేరుమాత్రం నేను నీతో చెప్పను.

మోహి—నేను మీచిన్నాయనకు భార్యను అయి వున్నట్టయితే అతన్ని నేను చెప్పినట్టెల్లా వినేటట్టుచేసి నిముషంలో యీయభిప్రాయమంతా మార్చివేస్తును.

వేంక—ఇందాకా చాలాసేపు ఆయనకూ నాకూ వివాహం విషయమయ్యే ప్రసంగం జరిగినది. ఆప్రసంగంలో నేను మాచిన్నాయనతో మీకు యిదివరకు స్త్రీలవిషయంలో కలిగిన అనూయ అంతా

విడిచిపెట్టి యెప్పుడో వకప్పుడు మీరుకూడా పెళ్ళిఆడుతారని అనేటప్పటికి మాచిన్నాయనగారు తానటువంటిగాడిద కావడం తటస్థిస్తే పెళ్ళిరోజుననే నాకు యిరవైవేలరూపాయలుయిస్తానని పందెంవేసినారు. నీకు యిప్పుడు ముప్ఫయియేళ్ళయినా నిండా లేవు. నీవు యేవుపాయం చేతనైనా మాచిన్నాయనగారి మనస్సు చలింపచేసినట్టయితే, ఆయన ఖజానాలోనుంచి యిరవైసంచులు కదిలి నాచేతులోకి వస్తవి.

మోహి—రతిసుందరియొక్క సౌఖ్యంనిమిత్తం నన్ను యేమి చెయ్యమన్నా చేస్తాను. దానికి తల్లి నాలుగోయేట పోయినది. ఎనిమిదేళ్ళు వచ్చేటప్పటికి దానితండ్రి నాఅన్నగారుకూడా హైకోర్టువకీలుగా వుండి కాలంచేసినారు నాఅన్నగారు పోయేప్పటికి నాకు పద్దెనిమిదేండ్లుమాత్రమేవున్నా, తల్లిదండ్రులు లేనిబిడ్డ అని దానిసంరక్షణ నిమిత్తమే నేను వివాహంకూడా మానివేసినాను. దానికి యిప్పుడు పదహారేళ్ళువున్నవి. మీచిన్నాయనను మోహపుచ్చడం యెంతప్రయాసమయినపని అయినా, మా రతిసుందరికీ నీకూ వివాహం సంఘటన చెయ్యడానికి యెన్ని పాట్లయినా పడుతాను.

వేంక — ప్రయత్నంమాత్రం చెయ్యి. నీవు నిజంగా నాపినతండ్రిని పెళ్ళి చేసుకోనక్కరలేదు లే.

మోహి—నాఅన్నగారికిన్ని నీపినతండ్రికిన్ని పూర్వం చాలా స్నేహంసుమా. వారిద్దరూ బాల్యస్నేహితులు.

వేంక—ఆలాగా? ఆలాగయితే మనంచేసేప్రయత్నానికి అది సహాయకారిగానే వుంటుంది. యెలాగయినా నీవు నీనేర్పున్నూ సామర్థ్యమున్నూ చమత్కారమున్నూ వాక్చాతుర్యమున్ను కనపరచి మాచిన్నాయనను వలలో పడవేస్తివా, మీరతిసుందరికి మంచిమొగుడు రావడమే కాకుండా మేనకోడలిభర్తకు యిరవయివేల రూపాయలు

కూడా చేతులో పడతవి.

మోహి——ఇదంతా జరగడం నేను నీపినతండ్రిని వివాహం ఆడ డంవల్లనా ?

వేంక——వివాహమాడడమా? అది యెప్పుడూ సాధ్యంకాదు. మాటలు చెప్పడంసులభంగాని కార్యంచెయ్యడం సులభంకాదు. ఆయనకు యెన్నిచిక్కులు తెచ్చిపెట్టినా, తనఆస్తి అంతాఅయినా విడిచిపెడుతాడుగాని నిన్నుమాత్రం వివాహంకాడు.

మోహి——అలాఅనబోకు. స్త్రీలు తారసించినప్పుడు పురుషుడిమనస్సు యెంతగట్టిదయినా కరగక మానదు. ప్రయత్నంచేసి ముందుగా మాచిన్నాయనగారి మనస్సులో కొంచెం కామాగ్నిని తగిలించి దరికొల్పినతరువాత, అది అంటుకుని మండుతూవుంటే మళ్ళీ ఆర్పివెయ్యడం సాధ్యంకాదుసుమా.

వేంక——అలా నిజంగా కామాగ్ని రవులుకొని మండితే మన్మథాగ్నిచేత కాలిచావడంకంటె తప్పకుండా వివాహ మాడడమే వుత్తమం. అయినాకానీ నీప్రయత్నంమాత్రం సాధ్య మవుతుం దనుకోను. నేను యెరిగినంతవఱకు మాచిన్నాయనగారి మనస్సు స్త్రీలవిషయంలో రాయి అయిపోయినది. వజ్రంకంటెనూ కఠినమయిన ఆమనస్సునూ రగ్నిహోత్రాలు దరికొల్పినా కరిగేదికాదు. దాన్ని కరిగించేశక్తి లోకంలో యెక్కడనూ లేదు.

మోహి——వొక్క-చోటమాత్రం వున్నది.

వేంక——యెక్కడవున్నది ?

మోహి——ఇక్కడ వున్నది. (అని తనహృదయమును చూపుచున్నది.)

వేంక——ఏదీ నీశక్తి చూతాము కాదూ !

మోహి—నీవే శీఘ్రకాలంలో చూచి మెచ్చుతావు. నాకు యిప్పుడు వకవుపాయం తోస్తూవున్నది. పూర్వంవకసారి నాయన్న గారున్ను మీచిన్నాయనగారున్ను కలసి యేదోవక లా (ధర్మశాస్త్రం) వున్నదని పుస్తకం తీసి వ్యాజ్యం వేసి పురుషునికి యిష్టంలేనిదే ఆతణ్ణి మోహించిన వకచిన్నదానికి బలవంతంగా వివాహం చేయించినారు.

వేంక—అలాగంటి ఆక్టుకూడా వకటి అమలులోవుండేదా?

మోహి—వెనుక వుండేది. అది యిప్పుడు రద్దు కాకుండా వున్నట్టయితే, యిరవై వేల రూపాయలున్ను నీచేతిలో పడ్డవే. యీకాలంలో ఆక్టులు గడియగడియకూ మారుతూ వుంటవి.

తిమ్మయ్య—(తనలో నేమో అనుకొనుచు వెలుపల) ఈసంగతి నాయజమానుడితో చెపుతాను

వేంక—(ఆమాటలాలకించి) అదుగో తిమ్మడు వస్తూవున్నాడు మనంయిద్దరమూ మాట్లాడుతున్నట్టు వాడికి తెలియకూడదు. నీవు యీదారిని వీధిలోకి వెళ్ళు.

(అని యొకతలుపు తీయుచున్నాడు.)

మోహి—నీవేమీ భయపడవద్దు మరియొకమారు త్వరగా నేను యిప్పుడే మళ్ళీవస్తాను. (అని వెళ్ళుచున్నది.)

[అప్పుడు ధనకోటిరాజు గారును తిమ్మయ్యగారు ప్రవేశించుచున్నారు]

ధన—ఓరి సోమరిపోతా! ఇంతసేపటిదాకా యెక్కడికి వెళ్ళినావురా?

తిమ్మ—సోమిదేవమ్మగారి యింటికి. మీరుఅక్కడికి వుత్తరం యిచ్చి పంపించినారుకారా?

ధన—ఓరి వెధవా! యేమిటి తింటూవున్నావు?

తిమ్మ—నేను యీలాతింటూవుంటేనే బ్రతుకుతూవున్నాను.

లేకపోతే చచ్చిపోనా ?

ధన—ఓరి తాగుబోతా! నీవు తాగడంకూడా మొదలుపెట్ట లేదుగదా !

తిమ్మ—యీమితాయివుండ మింగనియ్యండి. తరువాత చెపుతాను.

ధన—ఓరినిర్భాగ్యుడా! నీకు మిఠాయి యెక్కడనుంచి వచ్చిందిరా?

తిమ్మ—నేనుకొనుక్కున్నాను రొక్కంయిచ్చి మరీకొన్నాను.

ధన—ఈరోజున నీకు నేనేమీ డబ్బియ్యలేదే.

తిమ్మ—మీరా! మీరా! మీరివ్వలేదు. నేను వేరే విధంగా డబ్బుసంపాదించుకోకుండా మీరు యిచ్చినదానితోనే తృప్తిపొంది వున్నట్టయితే నేను యిదివరకే స్వర్గానికి వెళ్ళి వుందును.

ధన—ఓరిదొంగా! నేనుయిచ్చినది కాకపోతే నీకు యింకా డబ్బెవరు యిస్తారురా?

తిమ్మ—ఎవరుయిస్తారా! మీపార్టీలు యిస్తారు. వారు మీస్వభావం యెరుగుదురు గనుక నామీద జాలితలచి యేదయినా యిస్తూ వుంటారు. యీరోజు వుదయాన్న కాగితాలు పట్టుకొని వెళ్ళి యిచ్చినందుకు సోమిదేవమ్మగారు బిళ్ళకుడుంలాగు రూపాయి చేతిలో పడవేసినారు.

ధన—(తనలో) అలాగయితే యికముందు నా క్లయింట్లకు కాగితాలు నేను స్వయంగానే తీసుకుని వెళ్ళి యిస్తూవుంటాను (బిగ్గరగా) ఏది ? ఆరూపాయి నాచేతికియ్యి. నేను జాగ్రతచేసి పెడతాను.

తిమ్మ—అప్పుడే ఆరూపాయి నా కడుపే జాగ్రతచేసి పెట్టింది. నాచేతిలో డబ్బుపడితే నేను అక్కడనేకాని మరియెక్కడా దాచుకోను.

ధన—ఆ! యేమిటి? నీవు అప్పుడే రూపాయికి రూపాయిఅంతా మింగివేసినావురా?

తిమ్మ—రూపాయి మింగలేదు. రూపాయి విలువచేసే వస్తువులను మింగివేసినాను.

[అపుడు తలుపు ఎవరో తట్టుచున్నారు.]

ధన—తలుపు యెవరో తట్టుచున్నారు. నీవు వెళ్ళి తలుపు తీసి రా. నేను లోపలికి వెళ్ళుతాను. (అని వెళ్ళుచున్నాడు.)

తిమ్మ—చిత్తము. (అని వెళ్ళి తలుపుతీయుచు) తలుపు గుద్దుతూ నిలుచోకు. వేగిరం లోపలికిరా.

[అప్పుడు మోహినీదేవి ప్రవేశించుచున్నది.]

మోహి—ధనకోటిరాజుగారు యింట్లో వున్నారా?

తిమ్మ—యెవరు వచ్చినారని చెప్పను?

మోహి—మోహినీదేవిగారు.

తిమ్మ—(తనలో) ఆహాహాహా! మోహినీదేవిగారా! (బిగ్గరగా) మీరు వచ్చినపని యేమిటి?

మోహి—ఆపని మీయజమానుడితో చెపుతాను.

తిమ్మ—ఆలాగైతే మీరుయేదో కేసులో సలహాపుచ్చుకోవడానికి వచ్చినట్టున్నారు.

మోహి—ప్లీడరుగారితో మాట్లాడడానికి వచ్చినానుగాని ఆయన నవుకరుతో మాట్లాడడానికి రాలేదు.

తిమ్మ—నీవు భ్రమపడుతూ వున్నావు. నాకూ ఆయనకూ భేదం లేదు. నేను ఆయనకు అంతరంగ స్నేహితుణ్ని.

మోహి—నీ వాలకం చూస్తే నీవందరికీ అంతరంగ స్నేహితుడి లాగే కనపడుతూవున్నావు.

తిమ్మ——మనుష్య ఆకారాన్ని పట్టి వూహ చెయ్యరాదు. మయివేసం యేలాగున్నా లోపలిసారం కావలసినంత వుండవచ్చును. నీవేషం చూస్తే నీవు మాన్యాలూ గీన్యాలూ బాగావుండి బలిసి చాలాడబ్బుగలదానివలె కనపడుతూ వున్నావు.

మోహి——నేను డబ్బున్నదానిలాగు కనబడుతూవుంటే నీవు తెగమెండిపోయి డబ్బు లేనివాడులాగు కనపడుతూవున్నావు.

తిమ్మ——నీకు మాయజమానుడి దర్శనం కావలెనా ?

మోహి——కావలెను.

తిమ్మ——ఆహోహో! అలాగయితే ఆయన యింట్లో లేరు.

మోహి——నేను యెరుగుదును. ఆయన యింట్లోనేవున్నారు. ఆగదిలోనే వున్నారు.

తిమ్మ——అలాగయితే ఆయన మిమ్మలిని యెరిగినవారేనా ?

మోహి——నేను ఆయన ముఖంమాత్రం యెరుగుదును. నాకూ ఆయనకూ పరిచయం లేదు.

తిమ్మ——మీకూ ఆయనకూ పరిచయం లేనిమాటనిజమే. ఇది వరకు పరిచయమే వున్నట్టయితే ఆయన ఆడవాళ్ళ తరపున యేవ్యవహారంలోనూ పూనుకోడని మీకు తెలిసేవుండును. ఈమాటలు చెప్పి మీమనస్సుకు నొప్పి కలిగించడం నాకు యిష్టంలేదు. మీతో మృదువుగా ఆయన యింట్లో లేడని చెప్పినాను.

మోహి——మీ యజమానుడిసంగతి నాకు బాగా తెలుసును. ఆయన బాగా ఫీజు యిస్తే యెవరికేజులోనయినా పనిచేస్తారు.

తిమ్మ——అలాగయితే మీరు బాగా ఫీజుయివ్వగలవారే అనుకుంటాను.

మోహి——అడిగినంతఫీజు యిచ్చేదాన్ని కాకపోతే నేను యిక్క-

డకు రానేరాకపోదును.

తిమ్మ——ఆలాగయితే వ్యవహారంలో వుండేచిక్కులూ ప్లీడరు పడేప్రయాసమూ మీకు బాగా తెలుసును కాబోలును.

మోహి——బాగా తెలుసును. పూర్వంమాఅన్నగారు లాయరు పనిలో వుండేవారు. ఆయన బ్రతికివున్నప్పుడు ఆయన వ్యవహారం నేనే చూచేదాన్ని.

తిమ్మ—మీకు లెక్కలుకూడా తెలుసునా?

మోహి——లెక్కలలో నాకు వట్టిసున్నాలకు కూడా విలువ కలుగచెయ్యడం తెలుసును.

తిమ్మ——సున్నాలకు విలువ యేలాగు వస్తుంది?

మోహి——ముందు అంకెలు చేరిస్తేసరి. నీ అంకిలి లేకుండా వుండడానికి యిదిగో (అని ఒకరూపాయి చేతిలో పెట్టుచున్నది.)

తిమ్మ——(నవ్వి) అమ్మా! నీకు కోర్టువ్యవహారం బహుబాగా తెలుసును. అంతా యిందులో వున్నది. బంట్రోతు మొదలుకొని ప్లీడరుగారివరకూ డబ్బు చేతిలో పడనిదే యేపనీ చెయ్యరు. అమ్మా! యిప్పుడు నావల్ల మీకు యేకార్యంకావలెను?

మోహి——మీప్లీడరుగారిదర్శనం చేయించు. ఇంకోసారివచ్చి నప్పుడు నీకు రెట్టింపు బహుమానం చేస్తాను.

తిమ్మ——నీతల్లికడుపు చల్లగా నీవు వెయ్యేళ్ళు వర్ధిల్లవలెను. ఇక నీకు నిముషంలో నాయజమానుడి దర్శనంచేయిస్తాను వుండండి.

(అని వెళ్ళుచున్నాడు)

మోహి——నేను వీణ్ణి వశ్యంచేసుకున్నాను. ఇప్పుడు వక్క ప్రతిబంధం తక్కువయింది. ఓధనమా! నీప్రభావం యెవరు పొగడ గలరు? లోకంలో యెంతటి వారున్ను నీకు దాసులేకదా? ఓభాషా

దేవీ! నీవు ఇఖ నాకు తోడుపడి నాకు జయము కలుగ చెయ్యి. నీ అనుగ్రహంవల్ల నాకు ఇదివరకు యెప్పుడూ సమయోచితంగా మాట్లాడడంలో పరాభవం రాలేదు.

[తిమ్మయ్యయు ధనకోటిరాజును ప్రవేశించుచున్నారు.]

ధన—అమ్మా! ఏదో వ్యవహారంలో నీవు నన్ను ఆలోచన అడగడానికి వచ్చినావని నా నవుకరు చెప్పుతూవున్నాడు.

మోహి—అవును. నేనందునిమిత్తమే వచ్చినానుగాని నేను మీతో రహస్యంగా మాట్లాడవలసి యున్నది.

ధన—ఓరితిమ్మా! నీవు అవతలికి పో.

తిమ్మ—చిత్తము. (అని వెడలిపోయి గుమ్మమువద్ద పొంచుండి వినుచున్నాఁడు.)

మోహి—అయ్యా! నేనువచ్చిన వ్యవహారాన్నిగురించి మాటాడడానికి ముందుగా నాసంగతి కొంచెం చెప్పుతాను.

ధన—అవశ్యంగా చెప్పవచ్చును. మీరు కూర్చోండి.

(ఇద్దఱును కూర్చున్నారు)

మోహి—అయ్యా! నేను యిప్పుడు మీసలహా కోరి వచ్చిన విషయం బహు వింతైనదిగా కనబడుతుంది. అందుచేత—అందుచేత—

ధన—అమ్మా! తొందరపడబోకు. సావకాశంగా చెప్పవచ్చును.

మోహి—నేను యిప్పుడు మీకాలం వ్యర్థపుచ్చడం లేదు గదా? మీకవతల తొందరపని వున్న దేమో!

ధన—లేదు లేదు. నింపాదిగా చెప్పు. పనివచ్చినప్పుడు వేరే పనివున్నా సావకాశంగా వినవలెను.

మోహి—మాఅన్నగారయిన భూపతిరాజుగారు—

ధన—(ఆశ్చర్యముతో) భూపతిరాజుగారు మీకన్నగారా?

ఆయన నాకు ప్రాణమిత్రుడు.

మోహి—అవును. ఆయనా నేనూ యేకగర్భజనితులము.

ధన—ఆయన చాలా ధనం సంపాదించినారు. మీకుటుంబానికి తగినంత ఆధారం వుంచిపోయినారా?

మోహి—ఆయన మాకు అన్నవస్త్రాలకు యేమీ లోపం లేకుండా తగినఆధారం చేసే పోయినారు.

ధన—ఆమాట వినడంచేత నాకు బహుసంతోషంగా వున్నది. నేను చూస్తూవుండేవాణ్ని. ఆయన కప్పుడు పదిపదహారు సంవత్సరాల వయస్సులోవున్న పెళ్ళికాని తోడబుట్టిన పడుచు వుండేదే! ఆవిడ మీకు అప్పగారా? చెల్లెలా?

మోహి—ఆ పదహారేళ్ళ చిన్నదాన్నే నేను. నేను యిప్పటికిన్ని వివాహం చేసుకోనే లేదు.

ధన—ఓహో! నీవు యిప్పుడు యెంత మారిపోయినావు. నిన్ను నేను యిప్పుడానవాలు పట్టలేకపోయినాను. నీరూపంకొంచెం—

మోహి—(అతనివంక తేరపార చూచుచున్నది.)

ధన—ఆమ్మా! మారడం అంటే నీవు మరివకలా గనుకోకు. నీరూపం కొంచెం మారినా అందం యేమీ చెడలేదు. ఇప్పుడు మరి పకమోస్తరుఅందం వచ్చినది. (తనలో) కొంచెం ముఖం ముదురుగా వున్నా యీమె యిప్పటికిన్నీ చక్కనిదిగానే వున్నది.

మోహి—నేను యేమనుకుంటానోఅని మాట తిప్పుకున్నారు గాని, ఏ డెనిమిదేళ్ళకిందట నేను యింతకంటె కోమలంగానే వుండి వుంటాను. మా అన్నగారు పోయినవిచారంచేత కూడా నారూపం కొంత మారిపోయింది.

ధన—ఏమిమారినా యిప్పటికి నీరూపం యౌవనపురుషులను

వివాహాని కాకర్షించేలాగునే వున్నదిగాని మరివక విధంగా లేదు. ఇప్పుడే యింత మనోరంజకముగావున్న నీరూపము అప్పు డెంతమహా శ్రీకం కలుగచేసేదిగా వుండేదో?

మోహి—నాయందలి వాత్సల్యంచేత మీ రూరికే నన్ను స్తుతిచేస్తూవున్నారు. మనం మాట్లాడవలసిన కార్యం విడిచి దూరంగా వెళుతూవున్నాము.

ధన—నేను శ్రద్ధగా వున్నాను. వచ్చినకార్యంచెప్పు.

మోహి—ఇప్పుడు నా స్థితిగతులు మీకు పూర్ణంగా తెలిసినవికదా. నిజమయిన ప్రేమయున్ను గౌరవమున్ను గలిగి నేను మోహించిన వకపురుషుణ్ని యెలాగయినా బలవంతముగా నాకు వివాహం చేయించడానికి మీసహాయం కావలెను.

ధన—అదెంతపని? అవశ్యంగా చేస్తాను.

మోహి—ఆపురుషునికి యిష్టంలేకున్నా వివాహం చేయించవలెను.

ధన—అతని యిష్టానికి విరోధంగా చెయ్యడం కష్టమేకాని, అసాధ్యంమాత్రం కాదు.

తిమ్మ—(తనలో) వారు మెల్లిగా గుసగుసలాడుతూ వున్నారు. ఎవరికొంప తియ్యడానికో యీప్రయత్నం!

ధన—మరివకప్లీడరుదగ్గిరకు వెళ్ళక యీ విషయంలో నావద్దకు సలహాకు రావడం నీవు మంచిపని చేసినావు.

మోహి—మీరు ఆమాట అనడం నాకు పరమసంతోషంగా వున్నది. నాకార్యం సఫలం కావలసినయోగం వుండి నా అదృష్టం చేతనే మీదగ్గరకు రావటం తటస్థమయింది.

ధన—(తనలో) పాపము! ఆపురుషుడియం దీమె కెంతప్రేమ

వున్నదో!

మోహి—అయ్యా! యిందులో నేను ముందుగా చెయ్యావలసిన పని యేమో సెలవియ్యండి. యీవిషయంలో మనము బహు జాగ్రతగా వుండవలెను.

ధన—జాగ్రతయేమిటి? రెండోవానికి తెలియకుండా మన ఆలోచన బ్రహ్మాభేద్యంగా వుండవలెను. మొట్టమొదట నీవు చెయ్యావలసినపని నీవు వెళ్ళి ఆపురుషునితో మూడుమాట్లు వేరు వేరు సమయములందు రహస్యముగా గడియసేపు మాట్లాడిరావలెను. రహస్యంగానని యెందుకు చెపుతున్నానంటే, అతడు నిన్ను కామించి వివాహం విషయమై నీతో రహస్యసంభాషణ జరిగిస్తూ వున్నట్టు నీవు ముందు ప్రమాణంమీద న్యాయాధిపతివద్ద నమ్మకంగా సాక్ష్యం యివ్వడానికనుకూలంగా వుండేనిమిత్తం. జాగ్రత. నీవు వెళ్ళేటప్పుడు ప్రతీసారినీ యిద్దరుముగ్గురు సాక్షులను పెట్టి మరి వెళ్ళవలెనుసుమా!

మోహి—లా ప్రకారం అలాకావలెనేమి?

ధన—కావలెను. సరిగా నేను చెప్పినప్రకారం నీవు జరిగిస్తూ వున్నట్టయితే, తప్పకుండా నీవు కోరినపురుషుణ్ని నీకు వప్పగించడానికి నేను పూచీ పడుతాను.

మోహి—ఆ ఆక్టు ఇప్పుడు అమలులో వున్నదేకదా!

ధన—అమలులో వున్నదే. యీవిషయంలో నాసామర్థ్యమంతా వుపయోగిస్తాను. ఇంతకాలం కష్టపడి నేను చదువుకున్న లా అంతా వ్యర్థమయిపోతుందా?

మోహి—నాకు మీయందు దానమ్మక మున్నది. అయినా యిలాయిలా చేస్తే నీ కార్యం సఫలం అవుతుందని మీరు వక్క కాగితంముక్కమీద వ్రాసి యిస్తే మీరు నా విషయంలో మీ యావ

చ్ఛక్తినీ వుపయోగపరిచి కార్యసాఫల్యం చేస్తారని నాకు సంపూర్ణ విశ్వాసం వుంటుంది. తెలివిమాలిన ఆడదాన్ని గనుక మనసులోవుండే ఆతుర్దాచేత మిమ్మలిని యిటువంటి కోరిక కోరుతూ వున్నాను. నాకీ అభయహస్తం యివ్వడానికి మీ కేమయినా అభ్యంతర మున్నదా?

ధన—ఎంతమాత్రమూ అభ్యంతరం లేదు. సంతోషపూర్వంగా వ్రాసి యిస్తాను. (అని కలమును కాగితమును పుచ్చుకొని వ్రాసి యిచ్చుచున్నాఁడు)

మోహి—ఇది వ్రాసి యివ్వడంవల్ల మీరు నాకు కలుగజేసిన ఆనందం యింతా అంతా అని చెప్పడానికి నాకు శక్యం కాకుండా వున్నది.

తిమ్మ— (తనలో) ఓహో! యీవిడె యౌవనపురుషుల పాలిటి మృత్యుదేవతగా వున్నదే?

ధన—నావంటి పురుషుణ్ణి వకణ్ణి ధన్యుణ్ణి చేసి బలవంతంగానైనా సమస్తాశ్రమాలలోకి వుత్తమమైన గృహస్థాశ్రమసుఖం ఆతఁకి కలుగచేస్తున్నానుగదాయని నామనస్సులోనూ సంతోషం అపారంగా పొంగి పొర్లి పోతూ వున్నది.

మోహి—మీది సాధుహృదయం. మీకు మిక్కిలి శ్రమకలుగ జేసినాను.

ధన—ప్రయత్నం సఫలమయితే ఇది వకశ్రమే కాదు. ఓసుందరీ! మళ్ళీ యెప్పుడు వస్తావు?

మోహి—కొంచంసేపటిలోనే వచ్చి నాకున్ను నాప్రియుడికిన్ని జరిగిన ప్రథమదర్శనప్రసంగతి తిరిగీ తమతో మనవి చేస్తాను.

ధన—ఓసుందరీ! పోయిరమ్మా. ఈశ్వరుడు నీప్రయత్నము సఫలముచేయుగాక!

మోహి—ఇదంతా మీఆశీర్వచనము! (అని వెళ్లుచున్నది)

ధన—(తనలో) నాభార్య పోయినతరువాత స్త్రీలతో చాలా సేపు మాట్లాడినది యీమెనక్కతెతోనే. స్త్రీలు చూడడానికీ సంభాషించడానికీ మనోహరంగానే వుంటారు. కాని పురుషులు వాళ్ళవలలో పడితేమాత్రం మోసం తటస్థిస్తుంది. (బిగ్గరగా) ఓరీ తిమ్మా!

తిమ్మ—అయ్యా! వచ్చినానండి.

ధన—నీవు చీమలాగు పాకుతావు. వేగిరం నడచి రాలేవేమి? యీవుత్తరాలు తీసుకుని వెళ్ళి పయిచిరునామాలప్రకారం యెవరివి వారి కిచ్చి వచ్చేటప్పుడు సోమిదేవమ్మగారియింటికి వెళ్ళి ఆవిడె నక్కదోసకాయలు యిస్తానన్నది తీసుకునిరా.

తిమ్మ—చిత్తము. నక్కదోసకాయలు రుచిగానే వుంటవి. నా కవి బహుయిష్టము.

ధన—దోవలో నీకడుపాతురత కనపరచక యిచ్చినకాయలన్నీ తిన్నగా యింటికి తీసుకుని రా. నేను వీధిలోకి వెళ్ళి పావుగంటలోమళ్ళీ వస్తాను. నేను మళ్ళీవచ్చేటప్పటికి నీవు యిక్కడ వుండవలెను. దోసకాయలు తీసుకురావడం మరచిపోకుమా! జాగ్రత.

(వీధిలోనికి వెళ్ళుచున్నాడు)

తిమ్మ—(ఆయన కేసిచూచి తనలో) నాకు దోసకాయ లక్కర లేకుండా ఆవిడె మాటతోనే కడుపునిండింది. యీవేళ నాకు లావిషయమయి కావలసినంత తెలిసింది. నేను జన్మంయెత్తినతరువాత యిటువంటి లా వున్నదని యెప్పుడూ వినలేదు. ఆలాగైతే యిక యేస్త్రీ అయినా యేపురుషుణ్ణి పడితే ఆపురుషుణ్ణి బలవంతంగా పెళ్ళాడి తోడేలు మేకపిల్లను నోట్లో వేసుకొన్నట్లు వాత వేసుకోవచ్చును. ఇది మహాదొడ్డధర్మశాస్త్రం! ఇక నేను స్త్రీరూపం చూచినప్పుడలా బహు

జాగ్రతగా వుండవలెను. ఎవరో తలుపువద్ద పిలుస్తూవున్నారు. (వెళ్ళి తలుపు తీసి చూచి తొందరపడి) అయ్యో! ఆరంభములోనే నాకు స్త్రీదేవత ప్రత్యక్ష మయిందీ! దేవుడా! నాగతి యే మవుతుందో!— అమ్మా! లోపలికి రా.

[అప్పుడు రతిసుందరి ప్రవేశించుచున్నది.]

రతి—ధనకోటిరాజుగా రింట్లో వున్నారా?

తిమ్మ—లేరు. ఇంట్లో లేరు.

రతి—ఆయన వేగిరం ఇంటికి వస్తారా?

తిమ్మ — పావుగంటలో రావచ్చును. ఏమో యెలా తెలుస్తుంది? ఆయన గంటసేపటిలోనూ రావచ్చును. సాయంకాలందాకా రాకపోనూ వచ్చును. ఆయన ఇప్పుడు మాత్రం ఇంట్లో లేరు. అది నాకు తెలుసును. మీరు యిప్పుడు వెళ్ళి మళ్ళీ వస్తారా?

రతి—వెళ్ళను. ఆయన వచ్చినదాకా ఇక్కడనే వుంటాను.

(అని కూర్చున్నది.)

తిమ్మ—(ఉలికి పడి) అమ్మా! నేను వంటరిగా వున్నాను.

రతి—వుంటే యేమి? నాకేమీ భయం లేదు.

తిమ్మ—నీ కేమీ లేదుగాని నిన్ను చూస్తే నాకు మహాభయంగా వున్నది.

రతి—(నవ్వి) నీవు మహాధైర్యశాలివిగా వున్నావే! ఆడదాన్ని చూస్తే మగవాడికి నీకే భయం వేస్తున్నదా?

తిమ్మ—అందుచేతనే నాకు భయం వేస్తూవున్నది. నేను మగవాణ్ణి కాకపోయినట్లయితే నాకుభయంపడవలసిన అవసరమే లేకపోవును.

రతి—నీ కెలావున్నదోగాని నిన్నుచూస్తే నాకు భయం వెయ్యడంలేదు.

[వేంకటపతిరాజు ప్రవేశించి రతిసుందరికి కనఁబడకుండ వెనుక నిలుచున్నాఁడు]

తిమ్మ—నీకు భయంవెయ్యదు. నాకది నిశ్చయంగా తెలుసును.

రతి—నీవు వట్టి పశుప్రాయుడవుగా వున్నావు. యిలాగు యింటికి వచ్చినపార్టీలను అవమానపరచడంనిమిత్తమే నీయజమానుఁడు నీకు జీతం యిచ్చి వుంచినాడా?

వేంక—(ముందుకు వచ్చి) ఏమిటిది? నీవు యీమెను ఎందుకు అవమానపరుస్తున్నావు?

తిమ్మ—ఈమె వ్యాజ్యదారురాలని నాకు తెలియదు. నేను యేమనుకున్నానా—నేను యిప్పుడే పొంచుండి విన్నాను—కాదు. ఆమాట కాదు—నేను వంటరిగావున్నాను. ధర్మశాస్త్రంచూడబో తే అదీకాదు. నేనుయేమి చెప్పతూవున్నానో నాకు నాకు తెలియకుండా వున్నది.

వేంక—(కుర్చీ వేసి) ఓసుందరీ! దీనిమీఁద కూర్చుండు—ఓరీ! నీవు యిఖముందు యెప్పుడైనా ఇటువంటి దౌర్జన్యం చేసినావంటే—

(అని తిమ్మయ్యను వీధికేసి గెంటుచున్నాఁడు)

తిమ్మ—మీాచిన్నాయనగారు వుత్తరాలు తీసుకొని వెళ్ళ మన్నారు సోమిదేవమ్మగారినడిగి దోసకాయులు తేవలెను. పోతాను.

(అని వెళ్ళుచున్నాడు)

వేంక—ఓరతిసుందరీ! ప్రియురాలా! మనపాలింటి కూ్రరసింహంవున్న యీాగుహలోకే వెతుక్కుంటూవచ్చినావేమి? నీవువచ్చిన పని యేమిటి?

రతి—ఆపనియేమో నాకూ తెలియదు. మాఅత్తయ్య తాను ఇక్కడికి నాలు గైదునిముషాలలో వస్తాను. ముందుగా వెళ్ళి కంపెట్టు కుని వుండుమంటే వచ్చినాను. నేను యెందుకో సాక్షిగా వుండవలెనఁట.

నిన్ను చూస్తే నేను యెందులో సాక్షిగా వుండవలెనో చెపుతా వను కున్నాను.

వేంక—ఆవిషయం నీకెంత తెలుసునో నాకూ అంతే తెలుసును.

రతి—ఆవిడ యేపని తలపెడితే ఆపని సాధిస్తుందని నాకు నిశ్చయంగా నమ్మకంవున్నప్పటికీ, ఆవిడ యిప్పుడు యేమిచెయ్యదలచు కున్నదో నాకు తెలియలేదు. ఆవిడే నిజంగా మగవాడయినట్టయితే యీదేశంలో వుండేలాయర్ల నందరినీ మించిపోను.

వేంక—అవును. ఆవిడేముందర యే లాయరూ పనికి రాడు. అయినా కానీ ఆవిడె యీప్రయత్నంలో తప్పిపోయినట్టయితే మన బ్రదు కప్పుడు యే మవుతుందో !

రతి—ఏమీకాదు. అప్పుడు నేను కఠినహృదయు డైనమీపిన తండ్రిని ప్రార్థించి, నిన్ను వివాహ మాడనియ్యక పోయినట్టయితే వివాహతాపముచేత నేను ప్రాణాలు విడుస్తా నని చెపుతాను.

వేంక — ఆయనముందర ఆమాటలు సాగవు. వివాహాలు కావడంకంటె ప్రాణాలు విడువడమే ఆయునకు యెక్కువ యిష్టంగా వుంటుంది.

రతి—మీపినతండ్రిగారి విషయంలో ఆలా అనడం న్యాయం కాదు.

వేంక—ఓప్రియురాలా! ఆమాటలు నీవు నిజం చెయ్యకు. నేను వూరికే పరిహాసానికి అన్నాను.

రతి—అదినాకు తెలుసును. నీవు నన్ను కామించడమూ నన్ను వివాహము చేసుకోవడమూ కూడా పరిహాసానికే కాదుకదా?

వేంక—నే నలా వివాహం ఆడను. అందులో పరిహాసకం యేమీ లేదు.

రతి——నన్ను వివాహమే ఆడవా? ఏ మేమిటా?

వేంక——ఓప్రియురాలా! నామాటల కొపార్థాలు చెయ్యకు. నేను నిన్ను పరియాచకానికి వివాహ మాడ నన్నాను. నీమీద నాకు యెంత ప్రేమ వున్నదో నీమనస్సుకే తెలుసు. ఓప్రియురాలా! (దగ్గిరకువచ్చి) యేదీ వక్క ముద్దు పెట్టు.

(అని కౌగిలించుకొని ముద్దుపెట్టుకొనుచున్నాఁడు)

[అప్పుడు దగ్గుచు ధనకోటిరాజుగారు ప్రవేశించుచున్నారు.]

వేంక——మాచిన్నాయనగారు వస్తూవున్నారు.

రతి——(తొందరపడి) మీచిన్నాయనగారా?

వేంక——అవును. వెంటనే మూర్ఛపో.

రతి——ఆ. ఆ. (అని యాతని చేతులలో మూర్ఛిల్లుచున్నది.)

వేంక —— (పినతండ్రిని చూడనట్టు నటించుచు) ఓ కాంతా! నాకు బహువిచారముగా వున్నది. నేను క్షమార్పణ వేడుకుంటాను. అయ్యో! పాపము! ఈమె మూర్ఛపోయింది! నేను యిప్పుడు యేమి చెయ్యను? యీస్థితిలో యీమెను యిక్కడ వంటరిగావిడిచి అవతలకు వెళ్ళ వల్లకాదు. ఎవరయినా కొంచము చన్నీళ్ళు తెస్తే బాగుండును. ఈసంగతి వింటే పరమభండాలు డైన తిమ్మణ్ణి మాచిన్నాయనగారు తక్షణం తీసివేస్తారు. ఆయ నయినా యింటికివస్తే బాగుండును.

ధన——ఇదిగో నేను వచ్చినాను. ఇదంతా యేమిటి?

వేంక——ఏమీ లేదు. మీబంటోత్తు యీవిడను విస్తారంగా అవమానపరచినాడు. నేను వచ్చి నాలుగుతన్ని వాణ్ని వీధిలోకి గెంటి వేసినాను. ఇంతలోకే యీవిడె మూర్ఛపోయింది.

ధన——మనం యిప్పుడు యేమిచేతాము? ఆడదానితో యీతంటాలన్నీ యిప్పుడు యెవరు పడతారు? అబ్బాయీ! యిప్పుడు మనం

చెయ్యవలసినపని యేమిటి?

వేంక—కొంచెంసేపు మీరు యీచిన్నదాన్ని పట్టుకోండి. నేను వెళ్ళి సహాయం తీసుకుని క్షణంలో వస్తాను. (రహస్యంగా రతిసుందరితో) నీవు కదలమెదలకుండా వుండు.

ధన—పట్టుకోవడమా ? నే నీచిన్నదాన్ని చేతులో పట్టుకోవలెనా ? ఆపని నాచేత కాదు. నేను యిదివరకు యెప్పుడూ పరాయి ఆడదాన్ని నాచేతిలో పట్టుకో లేదు.

వేంక—(రతిసుందరితో రహస్యముగా) నీవు మూర్ఛలోనే వుండు. లేకపోతే మన యిద్దరికీకూడా భంగం వస్తుందిసుమా. (బిగ్గరగా) నాన్నగారూ! మీ రెలాగయినా కొంచెంసేపు పట్టుకోవలెను. నేను వీధిలోకి వెళ్ళి యీచిన్నదాన్ని తీసుకు వెళ్ళడానికి యే దయినా బండి తీసుకువస్తాను. ఈసమయంలో మనయింటికి యెవరయినా వస్తే—

ధన—అవును. అవును. అది సత్యమే కాని—

వేంక—కానీ లేదు. యేమీ లేదు. నేను వదలిపెడుతూవున్నాను. వేగిరం వచ్చి పట్టుకోండి.

ధన—(దూరముగా నుండి యామెను పట్టుకొనుచున్నాఁడు.)

వేంక—(వెళ్ళుచున్నాఁడు.)

ధన—అబ్బాయి ! వేంకటపతీ ! నన్ను వక్కణ్ణీ వదలిపెట్టి వెళ్ళకు. అయ్యో! వాడు వెళ్ళిపోయినాడు. నేను పట్టుకోలేను. నా చేతులు వణుకుతూవున్నవి. నేను వదలిపెడితే యీవిడకు దెబ్బతగులుతుందేమో! గట్టిగా పట్టుకోవలెను. (దగ్గరకు జరిగి గట్టిగా పట్టుకొని మొగమువంకజూచి) ఈమె ముఖం యెంతమనోహరంగా వున్నది. (అని యింతలో మోహినీదేవిని చూచి తొందరపడి రతిసుందరిని మెల్లగా క్రిందికి జార విడిచి తన చేతులు తీసుకొనుచున్నాఁడు)

[అప్పుడు మోహినీదేవి ప్రవేశించుచున్నది.]

మోహి—అయ్యో ! యిదేమిటండి ?

ధన—ఏమో ! నే నెరుగను.

[వేంకటపతిరాజు ప్రవేశించుచున్నాడు.]

వేంక—నాన్నగారూ ! నేను బండి తీసుకొని వచ్చినాను. ఈమెకు తెలివి వస్తూ వున్నట్టున్నది. (రతిసుందరితో రహస్యంగా) ఓప్రియురాలా ! ఈపాటి నీమూర్ఛవిడిచి తెలివి తెచ్చుకొని మెల్లగా లేచి రా. నీవు నీమేనత్తను యెరుగనట్టు నటించు.

(వారిద్దరును వెళ్ళుచున్నారు.)

మోహి—(వారు వీధిలోనికి వెళ్ళువరకును వారివంక జూచి) అయ్యో ! నాకు నిజంగా నవ్వు ఆగకుండా వున్నది.

ధన—ఏమిటా ! నన్ను చూస్తే నీకు నవ్వు వస్తూవున్నదా?

మోహి—కాదు. అందుచేతకాదు. నా అదృష్టదినాలు తలుచుకుంటే సంతోషం వస్తూవున్నది. నేను తలపెట్టినపని యేవిఘ్నాలూ లేకుండా దివ్యంగా సాగుతూవున్నది. ఆపురుషుణ్ని నేనప్పుడే రెండు మాట్లు చూడడం అయింది. నేను యీసంగతి మీతో మనవి చేసి వెళ్ళుదామని వచ్చినాను.

ధన—నీవు మహాదొడ్డదానవు. అప్పుడే రెండు మాట్లుచూచినావా!

మోహి—చూచినాను. యీ వేడిలోనే కార్యం సాగించవలెను గాని వేడి చల్లారితే తరువాత శ్రద్ధవుండదు.

ధన—నీవు సాక్షులను పెట్టినావా?

మోహి—ఆసాక్షులు వెలుపల నున్నారు. (అని వీధివంక చూపుచు) యిందాకా నేను వచ్చేటప్పటికి మీరు కౌగలించుకొన్న చిన్నది మీకు దగ్గిరబంధువురాలా?

ధన—బంధుత్వ మేమీ లేదు. ఆమె యెవరో పరాయిచిన్నది. ఏదో వ్యవహారవిషయంలో నన్ను ఆలోచన అడగడానికి వచ్చింది. నానవుకరు కొంచంమోటతనం చేసేటప్పటికి మూర్ఛ పోయింది. ఇంతలో నాఅన్నకొమారుడు వచ్చి వాణ్ని వీధిలోకి తరిమి వేసినాడు.

మోహి—ఆచిన్నదానితో కూడా వెళ్ళిన పడుచుచిన్నవాఁడు మీఅన్నగారి కొమారుడా?

ధన—అవును. అత డామెను యింటికి తీసుకొని వెళ్ళినాఁడు.

మోహి—ఇంటికా? అలాగయితే ఆత డాచిన్నదాన్ని మీవలె యెరుగనివాడు కాడు కాబోలును.

ధన—ఓహోహో! నీమాటలవల్ల నాకొక కొత్తసంగతే తెలిసినట్టున్నది.

మోహి—అదంతా నాకెందుకు? నేను యిక్కడికి పనిమీద వచ్చినాను, నాపని నేను చూచుకోవలెను. ఆవిషయంలో ముందునన్ను యేమి చెయ్యమంటారో చెప్పండి.

ధన—నీవు ఇదివరకె రెండుసారులు చూచినావుగదా? మంచిది. నీతరపున నేను ప్లీడరునుగనుక నిన్ను కొన్నిసంగతు లడిగి తెలుసుకో వలసి వున్నది. నావద్ద నీ వేమీ దాచకుండా నిజంచెప్పవలెను. నీవు మంచిస్థితిలోవున్నట్టు చెప్పినానని జ్ఞాపకం, నిజమేనా?

మోహి—సాధారణంగా అనుకూలమైన స్థితిలోనే వున్నాను.

ధన—నీ కేమయినాపిల్ల లున్నారా?

మోహి—నాకు వివాహమే కాలేదు. నాసంరక్షణలో మా అన్నగారి కొమార్తెమాత్రం వక్కపిల్ల వున్నది.

ధన—ఆచిన్నదానికి తండ్రి యేమయినా ధనంయిచ్చి పోయి నాడా?

మోహి—నావివాహదినమందు దానికి యిరువైవేల రూపాయలు వస్తవి.

ధన—(తనలో) ఇరువై వేలరూపాయలా! ఆచిన్నదాన్ని మా వెంకటపతి కిస్తే బాగా వుండును. (బిగ్గరగా) మీఅన్నగారు ప్లీడరీలో బాగా సంపాదించి వుందురు.

మోహి—సాధారణంగా సంపాదించినారు.

ధన—ఆయన పోయి యెంతకాలం అయింది?

మోహి—ఏ డెనిమిది సంవత్సరా లయింది.

ధన—ఆయనను గురించి మీరు యిప్పుడు మరచిపోయి వుంటారు.

మోహి—యెంతకాల మయినా కొన్నిసంగతులు మరపునకు రావు.

ధన—అవు నవును. అది నిజమే. నీమేనకోడలికి సంబంధం యెక్కడనైనా కుదిరిందా? నాకు అన్నకుమారుడు వక డున్నాడు. వాడు మంచిచక్కనివాడు; యౌవనంలో వున్నాడు. నేను ధనహీనుణ్ని కానిసంగతి నీకు తెలుసునుగదా?

మోహి—నాకు తెలియదా! నన్ను గెలిపించలేకపోతే మీరు ఘొంతో వోడిపోతానని పందెం వేసినారే. మీరు ధనవంతులు కాకపోతే యెలాపందెం వేస్తారు?

ధన—ఆహోహోహో! ఆవిషయంలో నేను పందెం వోడిపోతానని లేశమూ నాకు భయం లేదు. నీమేనకోడలి యిరువై వేలరూపాయలు వస్తవనికాదా ఇప్పుడు చెప్పినావు?

మోహి—నేను కోరినపురుషుణ్ని నేను వివాహ మాడితే, అప్పుడు వస్తవి.

ధన—నీవు తప్పకుండా వివాహమాడుతావు. నాఅన్న కొడుకు విషయమయి యేమాలోచించినావు?

మోహి—ముందుగా నాపెళ్ళి అయితే, అటుతరువాత నామేన కోడలికి మొగుణ్ణిగురించి ఆలోచించడానికి కావలసినంత కాలం వుంటుంది. అయ్యా! మీరు మీఅన్నగారికుమారుడి వివాహంనిమిత్తం యింత ఆతుర పడుచున్నారు గదా, మీవివాహం సంగతి యెందు కాలోచించినారుకారు?

ధన—నేను నీతో నిజం చెపుతాను. నాది వట్టి పిరికి స్వభావం నాకు స్త్రీలంటే భయము.

మోహి—భార్య వస్తే మిమ్మల్ని ధైర్యశాలినిగా చేస్తుంది.

ధన—నాకు కొంచెం కోపం హెచ్చు.

మోహి—భార్య కోపం పోగొట్టి శాంతుణ్ణి చేస్తుంది.

ధన—నాకు నామనస్సు వచ్చునట్టుగా నడవడం యిష్టం.

మోహి—ఆవిడె అదీ పోగొడుతుంది.

ధన—ఈవిషయం నీతో వాదించడం కష్టం. నీవు లాయరు చెల్లెలవుగదా?

మోహి—ఆ హేతువుచేతనే మీవంటి లాయర్ల జిత్తులూ, నావంటివాళ్ళనేర్పు కలిస్తే మరీ శోభిస్తుంది. అవునా! ఆహాహాహా! (అని నవ్వుచున్నది)

ధన—(తనలో) ఆహాహా! నిశ్చయంగా యీమె సంతోష దాయినిగా వున్నది.

మోహి—(తనలో) నిశ్చయించగా యితడు వివాహం ఆడ తగినవాడే

ధన—(తనలో) యేస్త్రీతో ముచ్చటించినప్పుడున్నూ యింత

సంతోషం యెప్పుడూ నాకు నాజీవితకాలంలో కలుగలేదు.

మోహి—(తనలో) ఇటువంటివాడు వివాహం కాకుండా వుండడం చూస్తే విచారకరంగా వున్నది. (బిగ్గరగా) అయ్యా! ప్రస్తుతం నేను సెలవుపుచ్చుకుని మళ్ళీ దర్శనం చేస్తాను ఈసారివచ్చినప్పుడు కడపటిదైన మా మూడో సందర్శనాన్ని గురించి మీకు మేలువార్త తేగలనని నమ్ముతాను.

ధన—ఆహాహా! అందుకు సందేహం లేదు. నీకు జయం కలుగుతుంది.

మోహి—నాకు జయం కలుగుతుందని మీకు నమ్మకంవుంటే కార్యం అయినట్లే. ఆహాహాహా!

ధన—నిశ్చయంగా నీకుకార్యసిద్ధిఅవుతుంది. అనుమానంలేదు.

మోహి—ఆహాహాహా! నాప్రయత్నం విఫలమయితే మీరు వేసిన పందెం మాట జ్ఞాపకం వుంచుకోండి. మీరు నాకు దండుగ యివ్వవలసి వుంటుంది.

ధన—నాకాభయంలేదు. నీకార్యం విఫలంకాదు. నీఅభీష్టము శీఘ్రముగానే నెరవేరుతుంది

మోహి—మీఆశీర్వచనప్రభావంవల్ల నెరవేరవలెను. నేను యిది మీరు యిచ్చిన వర మనుకుంటాను. నాయందు పరిపూర్ణానుగ్రహం వుంచండి. నేను సెలవు పుచ్చుకుంటాను. (అని వెళ్ళుచున్నది.)

ధన—(ఆమెవంక చూచుచు) ఆహాహాహా! ఈవిడెది బహు సుందరమయిన విగ్రహము. మొగం యెప్పుడూ నవ్వుతూ కలకల లాడుతూ వుంటుంది. నాకు యీమె భార్య అయితే నేను బహు సుఖంగా వుందును. భార్యా? ఆమాట తలపెట్టకూడదు. వద్దువద్దు. ఈ యింద్రియసుఖాపేక్షనుండి నాహృదయము మళ్ళునుగాక.!

[తిమ్మయ్య ప్రవేశించుచున్నాడు.]

తిమ్మ—నేను దోసకాయలు తీసుకువచ్చినాను. మీరు కొంచెముసేపు ఓపిక పెట్టినట్టయితే నేను వెళ్ళ నక్కరలేకుండా అవే యిక్కడకు వచ్చును.

ధన—నేను యింట్లో లేనప్పుడు మనయింటికి వచ్చినచిన్నదాన్ని యెందుకు జడిపించినావురా?

తిమ్మ—నేను జడిపించ లేదు. ఆవిడెను చూచి నేనే జడుసుకున్నాను.

ధన—దొంగ వెధవా! ఆవిడెను చూచి నీవు జడుసుకున్నావేమి?

తిమ్మ—ఆవిడె నేను వుంటే భయంలేదు తానున్న చోట నన్ను వుండవచ్చు నన్నది. నే నదివరకు విన్నమాటలమీద నాకు భయం వేసినది.

ధన—నీ వేమిమాటలు విన్నావు?

తిమ్మ—మగవాడియిష్టం లేకుండానే స్త్రీ వెళ్ళి నంటరిగా మూడుమాట్లు మాట్లాడివస్తే బలవంతంగా పెళ్ళి చెయ్యవచ్చునని మీ రావిడెతో చెప్పడం నేను వినలేదా? మీతో చెపుతాను, నాకు యిష్టంలేనిది యెవత్తయినావచ్చి బలవంతంగా నన్ను పెళ్ళిచేసుకోవడానికి నేను లోబడుతానా?

ధన—ఓరి బండకుంకా! ఆమాటలు విన్నావటర్రా?

తిమ్మ—విన్నాను.

ధన—యెక్కడనుంచి?

తిమ్మ—తలుపుచాటునుంచి.

ధన—ఆచేతికర్ర యిలాగు తీసుకునిరా.

తిమ్మ—వీధిలోనికి వెళుతారు కాబోలును. జోడుకూడా తీసుకునిరానా?

ధన—ముందుగా ఆకర్ర తీసుకుని రా.

తిమ్మ—ఇదిగో (అని తెచ్చి యిచ్చుచున్నాడు.)

ధన—(పుచ్చుకొని దానితో తిమ్మయ్యను కొట్టి) వెధవా! ఇఖ ముందుకూడా యిలా తలుపులవద్ద పొంచు నిలుచుండి వింటావా? బుద్ధి వచ్చిందా?

తిమ్మ—(ఆత్మసంరక్షణార్థముగా బల్ల నెత్తికడ్డము పెట్టుకొని) నేను పోయి మీామీాద ఫిర్యాదుచేస్తాను.

(వేంకటపతిరాజు ప్రవేశించుచున్నాడు)

వేంక—బాన్నగారూ! ఇది యేమిటి?

ధన—నేను పొద్దున్న వక క్లయింటుతో రహస్యంగా మాట్లాడినమాటలు యీాదున్నపోతు విన్నాడు.

తిమ్మ—నావినడంవల్ల మీారిప్పుడు చెప్పడంవల్ల వచ్చేదానిలో సగం నష్టమయినా లేదు.

ధన—గాడిదా! నోరుమూసుకో? మేము మాట్లాడుకొన్న దానిలో రాజద్రోహం యేమీా లేదు.

తిమ్మ—రాజద్రోహం దానిలో వెయ్యోపాలయినా కాదు. అది మీాకూ నాకూ మగవాడై పుట్టినవాడికెల్లా అపాయకరమైనది.

వేంక—ఓరీ! సీకాతలుపు కనపడుతూ వున్నదా?

తిమ్మ—నిస్సందేహముగా కనపడుతూ వున్నది.

వేంక—నీమాట నాకు నమ్మకం తోచకుండా వున్నది. ఆతలుపు వద్దకు వెళ్ళి చూపించు.

తిమ్మ—ఇదిగో (అని గుమ్మమువద్దకు వెళ్ళి చూపుచున్నాడు)

వేంక—(వానిని తోసివేసి) ఫో (అని వీధిలోనికి గెంటి తలుపు లోపల గొళ్ళెమువేసి) నాన్నగారూ! అది యేమిటో యిప్పుడు చెప్పండి.

ధన—నేటి వుదయాన్న నేను వకళ్ళయింటిలో రహస్యంగా చెప్పినసలహాలను తాను పొంచుండి విన్నా నని యీ కుక్కలకొడుకు నాయెదుట వప్పుకుంటున్నాడు. ఆసంగతి యెందుకు గాని నీకు భార్య కావలె నన్నావుగదా యింకా నీ వాకోరికతోనే నావున్నవా?

వేంక—ఆకోరికతోనే వున్నాను.

ధన—నీకోసం చక్కని గుణవంతు లయిన పదహారేళ్ళ చిన్నదాన్ని మాట్లాడినాను.

వేంక—మీామేలు యెప్పుడూ మరచి పోను.

ధన—ఆచిన్నది యిరువై వేలరూపాయలు అరణంకూడా తీసుకు వస్తుంది.

వేంక—ఆలాగైతే ఆచిన్నది మాంతిసుందరి.

ధన—మీారతిసుందరిని గురించి యెవరు చెప్పినారు? నేను కుదిర్చినచిన్నది వకస్నేహితుని కూతురు.

వేంక—ఆలాగయితే ఆచిన్నది నాకు భార్యగా పనికిరాదు

ధన—ఆచిన్నదే నీకు తప్పకుండా భార్య అవుతుంది: ఆచిన్నది నీ కక్కర లేకపోతే నీ కెప్పుడూ భార్యేరాదు.

వేంక—నేను మరికొంతకాలం కనిపెట్టుకొని వుంటాను.

ధన—ఇక నీకనిపెట్టుకు వుండడం పనికిరాదు. నీవు ఆచిన్న దాన్ని పెళ్ళాడితే పెళ్ళాడు. లేకపోతే నేను నీముఖం చూడను.

వేంక—ఆచిన్నదాన్నా?

ధన—అవును. ఆచిన్నదాన్నే. నేను చెప్పిన చిన్నదాన్ని వివాహం చేసుకుంటే నేను నాఆస్థిలో సఖం నీకు యిస్తాను. చేసు

కోకపోతే యేమీయివ్వకుండా నిన్ను కట్టుబట్టలతో నా యింట్లోనుంచి వెళ్ళగొడుతాను.

వేంక—నాన్నగారూ! ఆలోచించుకోవడానికి నాకు కొంచెం కాలం సావకాశం యివ్వండి.

ధన—పదినిముషాలకాలం యిచ్చినాను. ఈలోపుగా ఆలోచించుకో.

(తిమ్మయ్య ప్రవేశించుచున్నాడు.)

తిమ్మ—అయ్యా! మోహినీదేవి వచ్చింది. ఆవిడె యిప్పుడు మిమ్మలిని వెంటనే చూడవలె నంటూవున్నది. (ధనకోటిరాజుగారి వద్దకు వెళ్ళి మెల్లగా) ఆవిడె మిమ్మలిని పిశాచంలాగు పట్టుకున్నది. ఇఖ వదలిపెట్టదు.

ధన—వదురుబోతా! నీ అధిక ప్రసంగం చాలించి, ఆవిడను లోపలికి రమ్మను.

తిమ్మ—చిత్తము. (అని వెళ్ళుచున్నాడు.)

ధన—అబ్బాయీ! నీవు కూడా వెళ్ళి మోహినీదేవి వెళ్ళిన తరువాత మళ్ళీ రా.

వేంక—మంచిది. (అని వెళ్ళి మోహినీదేవియు నతేడును ఏమేమో సైగలు చేసికొనుచున్నారు.)

(మోహినీదేవి ప్రవేశించుచున్నది)

ధన—ఓసుందరీ! కార్యం నీ వనుకొన్న ట్లయినదా!

మోహి—దివ్యంగా అయినది. కాని నామనోభీష్టసిద్ధి అయ్యే కాలం మిక్కిలీ సమీపించడంచేత—మనస్సులో యేలాగో వున్నది. అది యిలాగంటిదని నేను చెప్పలేను. నాకు మూర్ఛ వచ్చేటట్టు వున్నది. (అని సోలుచున్నది)

ధన—(తొందరపడి మెల్లమెల్లగా సమీపమునకు వెళ్ళి పట్టు కొని) ఓ యీశ్వరుడా! నన్ను రక్షించు. తెల్లవారి లేచినతరువాత స్త్రీని నాచేతులతో పట్టుకోవడం ఈరోజున యిది రెండోమాటు. (ఆమెకేసి చూచుచు) అయ్యో! పాపము. (ఈ సమయములో తిమ్మ య్య వెంటరాఁగా వేంకటపతిరాజును రతిసుందరియు చప్పుడుకాకుండ మెల్లగా ప్రవేశించుచున్నారు.)

ధన—ఈవిడను చూస్తే నాకు జాలివేస్తున్నది. చిన్నపిల్లవాడు నాతొడలమీద కూర్చుండి నాన్నా అని పిలుస్తూవుంటే కలిగేసంతో షం నేనుమాత్రం యెందుకు పొందరాదు? ఇక్కడ యెవరూ సమీ పంలో లేరు. (అని యామెను ముద్దు పెట్టుకొనుచున్నాఁడు)

తిమ్మ—(అప్పు డెదుటకు వచ్చి నిలుచున్నాఁడు)

మోహి—(మూర్ఛ తేరి కేక వేయుచున్నది)

ధన—(నివ్వెరపడి వేగిరము మాటరాక తడఁబడుచు) ఏ—ఏ—ఏమిటిది?

మోహి—ఏమీలేదు. (తిమ్మయ్యవంక చూచి) ఏదోకొంచెం భయంవేసి వెనక కొరిగినాను.

ధన—కొంకనక్కా! ఈగది విడిచి అవతలికి పో.

మోహి—అతడు వెళ్ళనక్కరలేదు. నేను యిప్పుడు చెప్పబో యేదానికి రహస్యం అక్కరలేదు.

ధన—సత్యం. ఇఖ రహస్యంతో పనిలేదు. నీ విప్పుడు చెయ్య వలసిన పనల్లా ఆపురుషిడి పేరుమాత్రం చెప్పి సాక్షులను తీసుకుని రావలెను.

మోహి—సాక్షులు దగ్గరనే వున్నారు. ఆపురుషుడిపేరు— ఆహాహాహా!—నేను నిజంగా నవ్వు ఆపుకోలేకుండా వున్నాను. క్షమిం

చవలెను——ఆతడి పేరు——ఆతణ్ణి మీరు బాగా యెరుగుదురు.

ధన——అతడు పురుషులలో ధన్యుడనిమాత్రం నే నెరుగుదును.

మోహి——అతడు ధన్యుడని మీరు మనస్ఫూర్తిగా తెలుస్తారా?

ధన——నా మనస్ఫూర్తిగా తెలుస్తాను.

మోహి——ఆలాగయితే అతడు——ఆహాహా! ——మీరు యిదివరకే గ్రహించి వుంటారు——ఆతడు సామాన్యపురుషుడు కాడు——హాహాహా!——ఆధన్యపురుషులు మీరే. ఆయన పేరు ధనకోటిరాజుగారు. ఇదుగో వీరే నాసాక్షులు.

[అప్పుడు వేంకటపతిరాజును రతిసుందరియు ముందుకు వచ్చుచున్నారు.]

తిమ్మ——ఆహాహా! దివ్యంగా వున్నది. చివరకు ప్రభువు వారీవిడెవలలో పడ్డారు.

ధన——మోహినీ! నీవు నాకు తగినదానవే.

తిమ్మ——మిమ్మలిని మించినది.

ధన——ఆచిన్నది యెవరు?

మోహి——నా మేనకోడలు.

ధన——ఆచిన్నదానికి యిరవై వేల రూపాయలూ వస్తవా?

మోహి——నేను కోరినపురుషుణ్ని నేను వివాహ మాడిన తరువాత వస్తవి.

ధన——ఎవరిని?

తిమ్మ——ఏలినవారినే. మీరే యీమెవలలో తగులుకొన్నారు. ఆహాహాహా!

ధన——మోటదున్నపోతా! వూరుకో —— ఈచిన్నదాన్ని నేను యిదివరకు చూచినాను. అమ్మాయీ! నీవు యీప్పుదయాన్న యిక్క-

డికి యెందుకు వచ్చినావూ ?

రతి—నేను వెంకటపతిరాజుగారిని చూడడానికి వచ్చినాను.

ధన—అలాగయితే నీవు మావాణ్ణి యిదివరకేయెరుగుదువా?

రతి—ఎరుగుదును. ఆయన నన్ను వివాహం చేసుకుంటానని ఆరునెలలక్రిందనే మాట యిచ్చినారు.

వేంక—ఇఖ నేను దాచవలసిన పని లేదు. ఈమె చెప్పిన మాట నిజమే. నేను వివాహం చేసుకోవడానికి వరించి లోబరచుకొన్నది యీ చిన్నదాన్నే. యీచిన్నదానిసుఖం కోరే మోహినీదేవి గారు మావివాహానికి మిమ్మల్ని వప్పించడానికి యింత ప్రయాసపడ్డది.

ధన—వివాహ మంటే నాకు వుండే అసూయే మీకు మూరవై వేల రూపాయల అరణం యిప్పించిందా ?

మోహి—నిశ్చయంగా. నేను మీకు భార్యను కాలేక పోయినప్పటికీ ఆప్తురాలినిగానైనా వుంటాను.

ధన—ముద్దురాలా! నీ అమాయకత్వానికి చాలా సంతోషించినాను. యీ అమాయకత్వం నిన్ను చూచి నేను నేర్చుకున్నాను. (తనలో) పాపము నేను వద్దంటే యిప్పుడు యీమె యెంత చిన్నపోతుందో. నా మనస్సులో వున్న అభిలాషప్రకారంగా యిప్పుడు యీవిడెను వివాహం చేసుకోవడానికి వప్పుకుంటే యీ దౌర్భాగ్యుడు వేంకటపతిగాడు బ్రతికివున్నంతకాలమూ నన్నాక్షేపించి నవ్వుతూ వుంటాడు (బిగ్గరగా) నాకు చాలా విచారంగా వున్నది.

వేంక—(ముందుకువచ్చి) విచారంగా యెందుకు వున్నది,

ధన—ఈమెను నిరాకరించవలసి వచ్చినందుకు.

వేంక—యెందుకు నిరాకరించవలెను ?

ధన—నేను నిరాకరించడంనల్ల కలిగేదుఃఖానికి యీమె

తాళగల దని నీకు ధైర్యంవున్నదా ?

వేంక—(తల యూఁచుచున్నాఁడు.)

ధన—తాటికాయలాగు తలఆడిస్తా వేమి ? పరిహాసం మాని నేనడిగిన దానికి జవాబు చెప్పు.

వేంక—యీమెయందు మీకు నిజమయిన యిష్టం వున్నదా ? చెప్ప నక్కర లేదు. మీఅభిప్రాయాన్ని మీమాటలకంటె యిప్పుడు మీ చూపులే నాకు బాగా చెపుతూవున్నవి. ప్రస్తుతస్థితినిబట్టి మీసుఖమందు నాకు వుండే అపేక్షనుబట్టి నేను తప్పకుండా—

ధన—చాలును. నీఅభిప్రాయం నాకు తెలిసింది. మోహినీ! నీవు నాకు వోడిపోయినావు. నీఆస్థి నాకు యిచ్చుకోవలెను.

మోహి—ఎందువల్ల ?

ధన—నాకు లోబడడంవల్ల. ఇప్పుడు పాణిగ్రహణంచేసి నిన్ను నాకు సమర్పించుకోవలెను. (అని చేయిచాచుచున్నాఁడు)

మోహి—రాజుగారు నన్ను యిప్పుడు వేళాకోళం చేస్తూవున్నారు—

తిమ్మ—(తనలో) అతడు నిన్ను పెళ్ళి చేసుకుంటే నీవే వేళాకోళం చేస్తావు.

మోహి—యిది మోసానికి యెదురు మోసం కాబోలును.

ధన—ఇది మోసంగాదు. నేను నామనస్ఫూర్తిగానే చెపుతూవున్నాను. నీవు నాస్వభావానికి సంహించగలిగే టట్టయితే నిన్ను నా అర్ధాంగినిగా చేసుకొని నా ధనమంతా నిస్వాధీనం చేస్తూవున్నాను.

మోహి — ఈ అనుగ్రహం నేను యెంతమాత్రమున్ను యెదురు చూడనిదిన్ని ఆకస్మిక మయినదిన్ని కాబట్టి నేను—నేను—

ధన—నీవు వప్పకుంటావా ?

మోహి—(కొంచెం సే పాలోచించి) ఆ. వప్పుకున్నాను.

ధన—హోహోహో! ఇప్పుడు నవ్వవలసిన వా రెవరు? మనప్రథమ దర్శనసమయమందే నిన్ను చేట్ట పట్టగల అదృష్టమంతుణ్ణి నేను కానేమోనని మనస్సులో కించపడ్డాను.

తిమ్మ—ఇప్పుడు నవ్వవలసినవాణ్ణి నేను. నాకు యజమానుణ్ణి మించినయజమానురాలు వచ్చినందుకు బహుసంతోషంగా వున్నది. (అని గంతులు వేసి ఆడుచున్నాడు)

వేంక—మీకు యిటువంటి మంచిభార్య దొరికినందుకు నేను ఆనందిస్తున్నాను.

తిమ్మ—భార్యకాదు. అమ్మగారను.

వేంక—నాన్నగారూ! 'నేను భార్య కావలె నని కోరేటంత గాడిద నయితే'—ఆహోహోహో! నా యిరవై వేల రూపాయలూ దయచేస్తారా?

ధన—వెధవ యిరవై వేలరూపాయలు లక్ష్య మేమిటి? నాది యిఖ పదిరెట్లధనం పోయినా, నేను యీ సుఖం వదులుకోను. అబ్బాయీ! నీ వాచిన్నదాన్ని వివాహ మాడి, నేనాచిన్నదాని మేనత్తను యెలా సుఖపెడతానో నీవాచిన్నదాన్నలాసుఖపెట్టు.

మోహి—తుద కిదంతా విచిత్రంగా అయింది. ఇప్పుడు చూచిన వాళ్ళకందరికీ నామేనకోడలినిమిత్తంకంటె నానిమిత్తమే నేనెక్కువప్రయాసపడ్డట్టు తోస్తుంది. పరియాచకానికి భర్త అనుకున్నవాడు నిజంగా భర్తకావడమే తటస్థిస్తూ వున్నది. ఇదంతాచూడగా ధనకోటిరాజుగారు—

ధన—తాముపన్నిన వలలో తామే పడ్డారు—మిగిలినది నేను పూర్తి చేసినాను. (అందఱు నిష్క్రమించుచున్నారు.)

మహాబధిరప్రహసనము

గ్రంథకర్త:

కందుకూరి వీరేశలింగము పంతులు

★

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము,

రాజమహేంద్రవరము

1950

[వెల రు 0-4-0

మహాబధిరప్రహసనము

— ఇందువచ్చు పాత్రములు —

సుమంత్రుఁడు—ఇందుముఖితండ్రి

ధనపాలుఁడు—ఇందుముఖిని వివాహమాడఁదలఁచుకొన్న వరుఁడు

విజయవర్మ—విశాలాక్షి యన్న

వసంతసేనుఁడు—అన్నపూర్ణమ్మ తమ్ముఁడు

ఇందుఖము—సుమంత్రునికూఁతురు

విశాలాక్షి—ఇందుముఖి చెలికత్తె; విజయవర్మ చెల్లెలు

అన్నపూర్ణమ్మ—పూఁటకూళ్ళమ్మ

చండిక—వంటలక్క

సుబలుఁడు, రాముఁడు, కృష్ణుఁడు—అన్నపూర్ణ సేవకులు

౧. రంగము—అమలాపురములోని పూఁటకూటియిల్లు.

[సుమంత్రుఁడును, ధనపాలుఁడును, కూరుచుండఁగా అన్నపూర్ణమ్మ ప్రవేశించుచున్నది.]

అన్న—ఓరీ! సుబలా! రామా! కృష్ణా! ఒక్క చండికతప్ప నవుకర్లు మెవరూ కనపడ రేమి? బజారికి వెళ్ళడానికి యిక్కడ వక్కడూ లేడు. (అని లోపలికి వెళ్ళుచున్నది.)

సుమం—ఈవిడ కేకలవల్ల నాకు ఆట తోచకుండా వున్నది. ఇఖ అట మానివేసి లేతాము. (అని చేతిలోని చీట్లు క్రింద పడవేయుచున్నాఁడు.)

ధన—ఆటంతా పాడుచేసినారు. నాకు యీమాటు ఆరుబొమ్మలు వచ్చినవి. చివరదాకా ఆడితే యీమాటు నేను తప్పకుండా గెలుస్తును. నేను గెలిచేటప్పుడు మీరుయెప్పుడూ యిలాగేచేస్తారు. యిలాచేస్తే నాకు మహాకోపం వస్తుంది.

సుమం—(లేచి) నీవు కోపం చల్లార్చుకోవలెను. నీకు చీమ చిటుక్కుమంటే కోపంవస్తుంది. చీటికీమాటికీ యిలా ముక్కుమీద కోపంవుంటే సరిపడదు. నీకు నాకూతురిని యివ్వబోతూ వున్నాను గనుక, మొఖమాటం లేకుండా చెప్పడం ధర్మమని చెపుతూవున్నాను.

ధన—కూతురిని యివ్వబోతానని నావంటి గొప్ప యింటి బిడ్డను యిలా తృణీకరించడం మాత్రం మీకు ధర్మంకాదు. మీకూతురూ వారూ యింకా వచ్చినారుకారు. నిష్కారణంగా యిలా ఆలస్యం చెయ్యడం నాకు యిష్టంగావుండదు.

సుమం—పడవలురానిదే వాళ్ళు యెలావస్తారు? యింకా పడవలు వచ్చేవేళకాలేదు. రాజమహేంద్రవరమునుంచి వచ్చేపడవలుపన్నెండుగంటలయితేనే కాని రావు. కొత్తపెళ్లి కొడుకువుగనుక నీకు తొందరగా వుంటుంది.

ధన—ఇదితొందరా? పన్నెండుగంటలయ్యేటప్పటికి పిండివంటలతో భోజనం సిద్ధంకావలెనని యీపూటకూటావిడెతో చెప్పి యేర్పాటు చేసినాను. ఆలస్యమైతే అన్నంచల్లారి పాడయిపోతుంది.

సుమం—నీవు మహాబుద్ధిమంతుడవు.

ధన—అవును నేను బుద్ధిమంతున్నే. మాపళ్ళంకుర్రులో నన్నందరూ నూతన బృహస్పతినిగా భావిస్తారు.

సుమం—అది గొప్పగా యెంచడానికి మీ పళ్ళంకుర్రు అంత పెద్దగ్రామంకాదు. అక్కడ చదువుకున్న పండితులు యెవరూలేరు. అందుచేత నీవక్కడ బృహస్పతివే కావచ్చును.

ధన—మీరు యెగతాళిచెయ్యకండి. నన్ను మావూళ్ళో వాళ్ళు పూర్వం చిన్నతనంలో తెలివితక్కువవాడే అనుకునేవారుగాని, నేను స్వతంత్రుణ్ణయి వెనుక రెండుమాసాలు రాజమహేంద్రంలో వుండివచ్చినప్పటినుంచీ మావూళ్ళో బ్రాహ్మలు నన్ను బృహస్పతి కంటెనూ గొప్పవాణ్ణని నిత్యమూ స్తుతిచేస్తూవుంటారు.

సుమం—ఆహాహాహా!

ధన—ఓపికవుంటే మీరువినువచ్చినంతసేపు నవ్వండి. మొట్ట మొదట యెరుగక మావూళ్ళోవాళ్ళు నన్ను తెలివితక్కువ గాడిదనే అనుకునేవారు. కాని మాతండ్రిగారు పోవడంతోటే నేను మూడు నెల్లల్లో మూడువేలరూపాయలు ఖర్చుచేసేటప్పటికి బ్రాహ్మలు అప్పుడు నా తెలివి కనుక్కొని స్తోత్రపాఠాలు చెయ్యడానికి ఆరంభించినారు. మా నాన్నగారు నిలవచేసేనడబ్బు ఖర్చుచేసినతరువాత నాకు మరీ తెలివి వచ్చింది. యిప్పుడు పరదేశస్థుడు రెండుఝాములప్పుడువచ్చి అన్నం లేక నాలుక పెరుక్కున్నా చిల్లిగవ్వ చేతులోపెట్టను. ఇఖ నాకు పెళ్ళాం వస్తుంది. డబ్బు పాడుచేసుకోను. అహహాహా! మీరు నాకు యెన్నితోటలువున్నవో కళ్ళారాచూచినారుకదా! హాహాహా! సంవత్స రానికి రెండువేలరూపాయలు వస్తవి. హాహాహా! మీకు సంతోషంగా వున్నదా? హాహాహా! ఇఖ నేను పెళ్ళిప్రయత్నానికి మాపళ్ళెంకుర్రు వెళ్ళవలెను. హాహాహా! మీకొమార్తె సుఖపడుతుందని యిప్పుడు మీకు నమ్మకంతోచిందా? హాహాహా!

సుమం—ఆట్టేనవ్వబోకు. ఇప్పుడు నీసంతోషమంతా పొంగి పొర్లిపోతూవున్నది. అంతా యిప్పుడే అయిపోకుండా పెళ్ళినాటికి కొంచెందాచుకో. (తనలో) ఈవాలకంచూస్తే నాఅల్లుడు వట్టి బుద్ధి హీనుడులాగు కనపడతూవున్నాడు.

[అన్నపూర్ణమ్మ ప్రవేశించుచున్నది.]

సుమం——అన్నపూర్ణమ్మగారూ! ఈపాటి పడవలు వచ్చివుంటవి. మావాళ్ళను తీసుకునిరావడానికి పంపించిన బండికోసం మేము వీధిగుమ్మంలో కూర్చుండి యెదురుచూస్తూవుంటాము. నాకూతురు రావడంతోటే కూర్చుండడానికి గది సిద్ధం చేయించండి.

అన్న——ఎంతసేపు? నిముషంలో సిద్ధంచేయిస్తాను—ఓసీ! చండీ! చండీ!

[అప్పుడు చండిక ప్రవేశించుచున్నది.]

చండి——అమ్మా! వస్తున్నాను. నేను యిక్కడికే వస్తూవుండగా మీమాట వినపడేటప్పటికి అమ్మగారు యేదో జరూరుపనివుంటే నేకాని పిలవరని మళ్ళీ వెనక్కు వెళ్ళకుండా చటుక్కున చక్కా వచ్చినాను.

అన్న——ఆసోదంతా యెందుకు? నేను చెప్పినపని చెయ్యి. యీతాళంచెవి పట్టుకొని వెళ్ళి దక్షిణపుసావిట్లో నాలుగోగది తలుపులు తీసి చాపలూ అవీవేసి సిద్ధంగావుంచు. ఇప్పుడే పడవలలో యీయనకోమార్తె మొదలయిన ఆడంగులు వస్తారు.

ధన——పిండివంటలతో భోజనంపెట్టడానికి తలకు ఒక అర్ధరూపాయ చొప్పున యిస్తానని యిదివరకే యేర్పాటుచేసినాను. ఇందులో నీవు మళ్ళీ యేమీ పేచీ పెట్టగూడదు. కూరలూ పచ్చళ్ళూ యేమేమిచెయ్యవలెనో యిదివరకే యేర్పాటుచేసినాను. చెప్పినదానికంటె యెక్కువగాచేసి సొమ్ము తెమ్మంటే తరువాత నేనే యిచ్చేవాణ్ని కాను. ఇప్పుడే చెప్పివేస్తూవున్నాను. పిండివంటలతో భోజనం పెట్టవలసినవారు నలుగురేసుమా. సవుకర్లభోజనానికి పూటకు రెండేసి

అణాలు. యీప్రకారం యివ్వడం నీకు చాలాలాభం. అయినా కానీ యిదివరకు వప్పుకున్నాను గనుక అనుకున్నట్టు యిచ్చివేస్తాను.

అన్న—ఇది నా కేలాభమా? నేను యీ అన్నసత్రం పెట్టిన తరువాత యెప్పుడూ పిండివంటలతో భోజనం పెట్టడానికి—

ధన—ఆసంగతిపోనీ—మామగారూ! పిండివంటలతో పెట్టడానికి మనిషి వక్కంటికి అర్ధరూపాయి యివ్వడానికి వప్పుకున్నాను. (తనలో) నాలుగర్ధలు రెండురూపాయలు. అబ్బో! రెండురూపాయలా? నవుకర్లు యెంతమందివుంటారో—(బిగ్గరగా చండికతో) నాగదికి పక్కనువున్న గదిలో భోజనానికి నాలుగువిస్తళ్ళు వేయించు. మేమంతాకలిసి భోం చేస్తాము. లెఖ్ఖ నాలుగువి స్తళ్ళేసుమా!

చండి—మీరు నాతోచెప్పేది యింతేనా? ఇంకా యేమైనా వున్నదా?

ధన—అంతే. అంతే. నీతో యేమో చెప్పవలెననుకొని మరిచి పోయినాను. నేను పడుకునేగదిలో పరుపువెయ్యేమి? జాగ్రత నేను చెప్పింది మరిచిపోకు.

చండి—డబ్బు చేతులోపడుతూవుంటే మీ యెదుటవున్నంత సేపూ యేదీ మరిచిపోను. యీస్థలం విడిచివెళ్ళితే తరువాత మీకు యెంతజ్ఞాపకమో నాకూ అంతే జ్ఞాపకము.

ధన—ఆహాహాహా! బాగాచెప్పినావు మామగారూ! బండి వస్తూవున్నదేమో చూతాములండి. (అని వీధిలోనికి వెళ్ళుచున్నాడు)

సుమం—చూచినకొద్దీ నాఅల్లుడు వట్టిగాడిద అయినట్టు స్పష్ట మవుతూ వున్నది. ఇతను వట్టికోపిష్టిన్నీ లుబ్ధున్నూ వదురుపోతూ న్నూగా కనపడుతూ వున్నాడు. ఇంతమట్టుకు వచ్చినతరువాత ఇఖ పిల్లనియ్యననడం బాగావుండదు.

ధన—(వీధిలోనుండి) రండి. మామగారూ! రండి.

సుమం—వస్తున్నాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

చండి—అమ్మా! ఈ ధనపాలుడుగారు బొత్తిగా పనికిమాలిన వారుగా వున్నారు. ఈయనకిచ్చి పెళ్ళిచెయ్యబోయ్యే చిన్నదాన్ని తలుచుకుంటే నాకు విచారంగా వున్నది. నన్ను పెళ్ళిచేసుకోమంటే యితణ్ని నేనుకూడా—

అన్న—ఈవిషయం నీకుయేమీ తెలియదు. ఇతను బుద్ధిహీనుఁడయినా డబ్బున్న బుద్ధిహీనుఁడు. లోకంలో డబ్బువుంటే—

చండి—నన్ను యెవరో పిలుస్తూవున్నారు. వెళుతాను.

అన్న—పరుగెత్తబోకు. నేను చెప్పేమాటవిని మరీవెళ్ళు. యీ పెళ్ళివారు తప్ప మరియెవరువచ్చినా చోటులేదనిచెప్పి పంపించివెయ్యి. యెంతడబ్బు యిస్తామన్నా డబ్బుకాశపడి యెవరినీ లోపల ప్రవేశపెట్టకు—

చండి—గదిలేదు. సావిడిలేదు. వసారాలేదు. కూర్చోడానికయినా స్థలంలేదు. యేమీలేదు. అని చెపుతాను.

అన్న—వూరికేవాగబోకు. నీ అధికప్రసంగం చాలించి యెవరు పిలుస్తూవున్నారో వెళ్ళిచూచిరా.

చండి—నిముషంలో చూచివస్తాను. (అని పరుగెత్తుచున్నది.)

అన్న—ఇది తెల్లవారి లేచింది మొదలుకొని రాత్రి పడుకోబోయిందాకా వూరికే వదురుతూ వుండడమేకాని పనియేమీ చెయ్యదు.

[చండిక యిందుముఖిని విశాలాక్షిని వెంటఁబెట్టుకొని
మరల ప్రవేశించుచున్నది.]

అన్న—అమ్మా! యిలారండి.

చండి—అమ్మలారా! యిలారండి. యిలారండి. గుమ్మం దాటే టప్పుడు జాగ్రత. కాలికి దెబ్బలుతగులుతుంది. గడప మెల్లిగా దాటండి. మీరు చాలా దూరాన్నుంచి వచ్చినారుకాబోలును. లోపలికివచ్చి కూర్చుంటారా? అమ్మా! మీపెట్టెలు—

అన్న—(చండికను చేయిపట్టుకొని యీవలికిలాగి రహస్య ముగా) చండీ! నీవు వూరికే అరవక నోరుమూసుకో.

ఇందు—పెట్టెలు మానాన్నగారు లోపలికి పట్టించుకునివస్తారు.

అన్న—అమ్మా! మీరుగావడం నాకు చాలా సంతోషంగా వున్నది. మీరు వస్తారని యీరోజున యిరవై మంది మార్గస్థులను బసదొరకదని చెప్పి పంపివేసినాను. లోపలికిరండి.

చండి—ఇరవై మందా? యెక్కడయిరవై మంది? చలిదిభోజ నాల వేళకు లోపుగానే బసలులేవని చెప్పి నేనువక్కత్తెనే నలభై మందిని అవతలికి పంపివేసినాను.

అన్న—చండీ! వూరుకో—అమ్మా! మీరు వచ్చేముందరనే వక పడుచుచిన్నవాడు వచ్చేటప్పటికి బసదొరకదని చెప్పి పంపివేసి నాను. అతడు వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళిపోయినాడు.

విశా—(ఇందుముఖితో రహస్యముగా) చెలీ! ఆవచ్చిన దతడే కాబోలును.

అన్న—అమ్మా! నేనువెళ్ళి మీగది తయారుగావున్నదో లేదో చూచివస్తాను—

చండి—మనము వెళ్ళుదాము రా. (అని యిద్దఱును వెళ్ళు చున్నారు.)

ఇందు—అతడేకాబోలునా? ఆహాహాహా! ఆపడుచుచిన్నవాడికి అమలాపురంలో పూటకూళ్ళసత్రంలో వుండవలసిన అవసరంలేదు. ఆ

వచ్చినవాడు వకవేళ మనం రాజమహేంద్రవరంలో విడిచిపెట్టివచ్చిన నీవరుడు వెంకయ్యగారు కావచ్చును.

విశా—ఎవరయినా కావచ్చును. మాఅన్న విజయవర్మమాత్రం యెందుకు కాగూడదు? వారియిద్దరిలో యెవరోవకరు మనకంటె ముందుపడవలో వచ్చి వుండవచ్చును. వస్తే యిద్దరూ వచ్చి వుండవచ్చును.

ఇందు—నీవు యిందాకాకూడా యిలాగే చెప్పినావు.

విశా—వారు సమీపానికి వచ్చివుంటారని నాకు దృఢంగా నమ్మకం వున్నది. నామాటనమ్ము.

ఇందు—ఓసీ! నీవు వూహాలు మహాబాగా చేస్తావు. మా నాన్నగారు రాజమహేంద్రవరాన్నుంచి యిప్పుడు నన్ను యెందుకు పిలిపించినారో వూహచేసి చెప్పు. నేను యిరవయిసార్లు మళ్ళీమళ్ళీ చదివినా నాకు బోధపడలేదు. ఇదుగో మానాన్నగారు వ్రాసినవుత్తరం చదువుతానువిను. (అని యుత్తరముతీసి చదువుచున్నది.) "అమ్మాయి ఆస్తీ తోటలూ నేను స్వయంగా చూచినాను. అవి చూడడంతో టే నాకు చాలా సంతోషంకలిగి నిన్ను ధన్యురాలినిగా చెయ్యడానికి నిశ్చయించుకున్నాను.—నన్ను ధన్యురాలినిగా వెయ్యడానికా? ఈ మాటలు నాకేమీ అర్థంకావడంలేదు. తరువాత చదువుతానువిను— మీరు వెంటనేపడవమీద బయలుదేరి అమలాపురంలో అన్నపూర్ణమ్మగారి సత్రంలో నన్ను వచ్చి కలుసుకోండి. వచ్చేటట్టయితే నీ స్నేహితురాలిని విశాలాక్షినికూడా వెంటబెట్టుకునిరా—

విశా—అన్నిమాటాలూ నాకు అర్థమయినవి. నిన్ను ధన్యురాలినిగా చెయ్యడం అంటే నీకు వివాహంచెయ్యడం. ఇక పెళ్ళికొడుకు యెవ్వరంటావేమూ? మాఅన్నగారయిన విజయవర్మే అవు

తాడు. ఆ స్త్రీ తోటలూ వివాహకాలమందు మీదంపతులకు మీ నాన్నగారు అరణంయిచ్చేవి. ఇప్పుడన్ని మాటలుకూ అర్థం బాగా తెలిసిందా?

ఇందు—బహుబాగా తెలిసింది. నీ అన్నగారినిమాత్రం పుట్టి బుద్ధి యెరిగినతరువాత మానాన్నగారు యెప్పుడూ చూడలేదు. పేర యినా చెప్పుకోగా వినలేదు. ఇంతకంటే యేమి తెలియవలెను? మా మేనత్తగారియింటికి వెళ్ళినప్పుడు నాకు పెద్దాపురంలో మీ అన్నగారితో మొట్టమొదట పరిచయం కలిగినది.

విశా—అవును. నాకు యిప్పుడు వకటితోస్తూవున్నది.

ఇందు—వెంకయ్యగారుతప్ప నీకు మరియేమీతోచదు. నేనూ తోచడంలేదు. మీ అన్నగారూ తోచడంలేదు. నేను యిప్పుడు చది వినవుత్తరంయొక్క అర్థమూ తోచడంలేదు.

[రాముఁడు వెంటరాఁగా చండిక ప్రవేశించుచున్నది.]

చండి—అమ్మా! మీగది సిద్ధంగావున్నది. మీకోసం నేను శ్రీమపడి గదంతా శుభ్రంచేసినాను. అది యీయింట్లోవున్న గదు లన్నీకల్లా మంచిగది. మీరాగది చూస్తే—

రాము—చండీ! అమ్మగార్లతో నీవు చెప్పేది వేగిరంకానియ్యి. నీవు చెప్పేదయి పోతే నేను చెప్పవలసింది నేను చెపుతాను.

చండి—అయ్యో! నేను మరిచేపోయినాను. అమ్మా! యితను రాముఁడు. ఇందాకాయితను నాతో చెప్పినాడు. ఏమని చెప్పినాడా! ఏమిటో మరిచిపోయినాను. జ్ఞాపకం చేసుకోనియ్యండి. మీరు రావడంతోటే తనతో—ఓ రామా! నేను చెప్పేది సరిగా వుంటూవున్నదా?

రాము—చండీ! నీవు వూరికే ఆయాసపడక నాపని నన్నే చెప్పనియ్యి. అమ్మా! రాజమహేంద్రవరాన్నుంచి వచ్చిన ఆడంగులు మీరే అయినట్టయతే, యిదుగో మీలో వకరికి వుత్తరం తెచ్చినాను.

(అని విశాలాక్షి చేతి కిచ్చుచున్నాడు.)

విశా—(పుచ్చుకొని) ఈ వుత్తరంపయిని చిరునామా లేదే. ఇది నీచేతికి యెవరు యిచ్చినారు?

రాము—ఆయన మీతో తనపేరు చెప్పుమనలేదు. ఆయన తనపేరు నాతోనూ చెప్పలేదు గనుక నేను యిప్పుడు చెప్పుదామన్నా చెప్పలేను.

విశా—(ఇందుముఖితో) మనం యీవుత్తరంపుచ్చుకుందామా?

ఇందు—వుత్తరం పుచ్చుకుంటే నష్టంయేమివుంటుంది!పుచ్చుకో

రాము—అమ్మా! భయపడక పుచ్చుకో వుత్తరంపుచ్చుకుంటే నష్టంయేమీలేదు. నేను యీసత్రంలో దిగినవారికి యెంతమందికో వుత్తరాలు యిచ్చినాను. నావుత్తరాలవల్ల యెప్పుడూ యెవరికీ నష్టం కలగడంలేదు. నామాటనమ్మండి.

చండి—అమ్మా! యితడు చెప్పినమాటనిజం అందుచేతనే యీ సత్రింలో వాళ్ళందరూ యెప్పుడూయితణ్నే వుత్తరాలు యిమ్మంటారు.

విశా—ఈవుత్తరం పట్టుకువెళ్ళి యివ్వడానికి నీకు యివ్వవలసింది. యిచ్చినారా?

రాము—పుచ్చుకున్నతరువాత లేదని యెట్లాచెప్పను? అయినా కానీ మీరుకూడా యేమైనాయిస్తే వద్దనకుండా పుచ్చుకుని సంతోషిస్తాను. యీలోకంలో ధనంతో తృప్తిపొందినవారు యెవ్వరున్నారు?

విశా—ఇదుగోపుచ్చుకో. (ఒకఅణా చేతిలోపెట్టి) దీనితో నీకు తృప్తికలిగిందా?

రాము—అమ్మా! మీకు దేవుడు మేలుచెయ్యవలెను. ఈ డబ్బులతో నాకు సంతోషం కలిగినట్టే యీవుత్తరంతో మీకు సంతోషం కలుగవలెను. (అని వెళ్ళుచున్నాఁడు.)

విశా—వుత్తరములో యేమివున్నదో చూతాము. (అని విప్పి చదువుచున్నది—'ఓకాంతలారా! యేమిజరిగినా చూడండి; వినండి; యేమీ మాటాడకండి. మీరేమీ ఆశ్చర్యపడ్డట్టు కనపడవద్దు. ఎందుచేత నేను యిలాగు చెపుతూవున్నానో, అదంతా ముందుమీకే తెలుస్తుంది'—ఈవుత్తరం మనయిద్దరినీ వుద్దేశించ వ్రాయఁబడ్డదనుకుంటాను. ఇందులో దస్కతులేదు.

ఇందు—ఏమిజరిగినా వినివూరుకోవలెనా? ఆదస్తూరీ యెవరిదో నీవెరుగుదువా?

విశా—గుర్తుపట్టడానికి తెలియడంలేదు. ఇది స్వాభావికంగా వ్రాసినవ్రాతకాదు. ఎవరో మారుదస్తూరీతో పట్టిపట్టి వ్రాసినారు. అయినాకానీ మనం యిందులో చెప్పినట్టుచేసి ఫలితం యేమి జరుగుతుందో చూతాము.

ఇందు—ప్రయాణంమూలంగా మాసిపోయిన యీబట్టలు విడిచి మంచిబట్టలు కట్టుకుందాము. లోపలికిరా. (చండికతో) మాతండ్రిగారు వస్తే మేము యిప్పుడే వచ్చి కలుసుకుంటామని చెప్పు.

చండి—తప్పకుండా చెపుతాను. నేను వదురుబోతునని నాయజమానురాలు నన్ను యెప్పుడూ తిడుతూవుంటుంది. నేను వదురుబోతునయిందీ కానిదీ దేవుడికి తెలుసును. ఆసంగతి యెట్లావున్నా నేను వచ్చిన బాటసార్లకు చేసేవుపచారంలో మాత్రం యేమీలోపం చెయ్యను.

ఇందు—అదంతా సరేకాని ముందు మాగదిచూపించుపోవలెను. ఇదిగో నీబహుమానము. (అని రెండణా లిచ్చుచున్నది.)

చండి—అమ్మా! దణ్ణాలు దణ్ణాలు. ఇదంతా డబ్బుకోసం కాదు. కాని యెవరైనా డబ్బుచేతిలో పెడితే—మీరు తొందర పడుతూవున్నారు— మార్గంయిది. యిలారండి. మీదగ్గిర నేను మహా రాణీవద్ద కనిపెట్టుకుని వున్నట్టువుంటాను. మీరుమాత్రం వాకిట్లోవచ్చి "చండీ! చండీ" అని పిలవవలెను. పిలిచేటప్పటికల్లా యక్షిణీచేత వచ్చి నట్టు మీయెదుట నిలువబడుతాను.

[ఇందుముఖియు విశాలాక్షియు వెళ్ళుచున్నారు.]

చండి—ఈఅమ్మలు బహుమంచివారు. ఈయిద్దరిలో యెవరి కయినా ధనపాలుడు మొగుడుకావడం తటస్థమయితే నాకయినట్టు దుఃఖపడుతాను.

ఇందు—(లోపలినుండి) చండీ! రావేమి?

చండి—అమ్మా! మరిచిపోయినాను. వస్తూవున్నాను. (అని వెళ్ళుచున్నది.)

[అప్పుడన్నపూర్ణమ్మ ప్రవేశించుచున్నది.]

అన్న—ధనపాలుఁడు కుబేరుడంతధనముగలవాడే కావచ్చును. కాని నేను యెప్పుడూ యింతబుద్ధిహీనుణ్ని యీలోకంలో యెక్కడా చూడలేదు. ధనాశచేత యీయిద్దరు కన్యలలో యెవరినైనా యీ నిర్భాగ్యుడికి వివాహమనే మిషమీద బలిపెట్టేటట్టయితే నామనస్సు బహుఖేదపడుతుంది. పాపం వీరినిచూస్తే నాకు జాలివేస్తూవున్నది.

[ఈలోపల విజయవర్మ ప్రవేశించి మెల్లగా బల్లమీద కూరుచుండి యేదోపుస్తకము చూచుచున్నాఁడు.]

అన్న—(ఆశ్చర్యముతో) అయ్యో! ఈయన యెవరు? ఈయన యిక్కడకు యేలాగు వచ్చినాఁడు? ఈయనరాక చూడగా యీయన పయినుంచి వూడిపడ్డట్టు వున్నది. అయ్యా! మీకు యేమికావలెను?

విజ—అక్కరలేదు. అక్కరలేదు. నీవు నానిమిత్తమయి శ్రమపడి నీళ్ళు తేవలసిన పనిలేదు. నేను యెవ్వరికీ శ్రమకలుగచెయ్యను.

అన్న—అయ్యా మీరు యీరాత్రి యిక్కడ బసచెయ్యవలెనని వచ్చినారనుకుంటాను.

విజ—కాదుకాదు. అతడు యీరాత్రి యిక్కడకు రానే రాడు. రేపు వుదయాన్న భోజనపువేళకు తప్పకుండావచ్చి కలుసుకుంటాడు. (అని తలవంచుకొని చదువుకొనుచున్నాఁడు.)

అన్న—ఇతనిమాటయేమిటో నాకు తెలియకుండాఫున్నది. వసంతసేనా! తమ్ముడూ!

[వసంతసేనుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

వసం—అప్పా! వచ్చినాను.

అన్న—ఈయనయెవరు? యెక్కడనుంచి వచ్చినాడు? ఇతడు పిచ్చివాడాయేమిటి?

వసం—కాదు. పిచ్చివాడుకాదు. ఈయనకు మాటమాత్రం వకపట్టాన వినపడదు.

అన్న—ఇతడు యీలోపలికి యెలాగువచ్చినాడు?

వసం—ఈయన దొడ్డితోవను లోపలికివచ్చినాడు. ఈయన గుర్రాన్ని తిన్నగా దొడ్లోకి తోలుకొనివచ్చి, అక్కడ గుర్రందిగి, పట్టుకొమ్మని గుర్రంకళ్ళెం నాచేతికిచ్చినాడు. అప్పుడు నేను లోపల బసదిగడానికి స్థలంలేదని చెప్పినాను.

అన్న—మంచిపనిచేసినావు. అందుకు యితడేమన్నాడు?

వసం—నవ్వి, "గుర్రానికి గుగ్గిళ్ళకు సేరువులవలు చాలును. నీవు నాతో రానక్కరలేదు. లోపలికి నేనేవెళుతాను." అన్నాడు. అప్పుడు నేను మా అప్పతో మాట్లాడవలెనన్నాను.

అన్న—దానికేమన్నాడు?

వపం—"అబ్బాయీ! దీన్ని బాగాతోము." అని నాచేతులో వకరూపాయి పెట్టి తిన్నగాలోపలికినడిచివచ్చినాడు. అప్పుడునాకు యేమిచెయ్యడానికీ తోచక నీతో చెప్పడానికి నేనుకూడా వెనుకవచ్చినాను.

అన్న—స్థలంవుంటే గుఱ్ఱాన్ని పాకలోకట్టి వెయ్యి.

వసం—కావలసినంత స్థలంవున్నది. ఇదుగో యితడు యిచ్చినది కొత్తరూపాయి. సరి కొత్తరూపాయి. (అని వెళ్ళుచున్నాఁడు.)

అన్న—ఇతడు స్వంతయింట్లోవున్నట్లు సుఖంగా కాలిమీద కాలువేసుకొని కూర్చున్నాడు. ఇతడుబహుమంచివాడుగా కనపడుతూవున్నాడు. ఇతనికి చెవుడు రాపడంచూస్తే జాలివేస్తూవున్నది. ఇతడు మంచి పడుచుతనంలో వున్నాడు. బహుచక్కనివాడు. అయినా యితడు యిక్కడనుంచి వెళ్ళిపోవలెనని చెపుతాను. (మిక్కిలి బిగ్గరగా) అయ్యా! పెళ్ళివారిచేత మాయిల్లంతా నిండివున్నది. ఇక్కడ స్థలం లేదు. మీరు మరివకచోట బసచూచుకోవలెను.

విజ—అమ్మా! అతడు వేళకు రాగలుగునోలేదో అని నాకు విచారంగానే వున్నది. కోర్టులో రేపువచ్చే కేజులలో మొట్టమొదటిదే అతనిది.

అన్న—ఇక్కడ బసదొరకదు. మీరు మరివకచోటికి వెళ్ళిపోవలెను.

విజ—మంచిది. నేను యీరోజున మీబసలోనే వుంటాను. నీవు బహు దొడ్డయిల్లాలవు. నీకోరిక ప్రకారం నేను యీవూళ్ళోవున్నన్నాళ్ళూ మీబసవిడిచి మరివకచోటికి వెళ్ళను. (అని పుస్తకముచదువుకొనుచున్నాఁడు.)

అన్న—(గొంతుక సవరించుకొని) నేనుగొంతుక బద్దలయ్యేటట్టు యెంతబిగ్గరగా అరిచినా వక్కమాటయినా యితనికి వినపడదు. ఇతడు

జహాం నెమ్మదిగానూ వినయంగానూ మాట్లాడుతూవున్నాడు. ఇతడు యిక్కడవుండడంవల్ల యింతవరకు యెవరిపనికీ అడ్డంరావడంలేదు.

[ధనపాలుఁడు ప్రవేశించుచున్నాఁడు]

ధన—అన్నపూర్ణమ్మా! మేము యిలాగు భోజనంలేకుండా యెంతసేపునూడము! మేము సొమ్ము యిచ్చేటప్పుడు పెందరాళే మెతుకులు పడవేయనక్కరలేదా?

అన్న—నేను యెంతో తొందరపడే వంటచేయించినాను. నిష్కారణంగా కోపపడక కొంచెంసేపు శాంతం వహించండి. పని చేయించుకుని యిస్తూవున్నారుగాని నాకు మీరు సొమ్ము ధర్మానికి యివ్వడంలేదు—ఓసీ! చండీ!

[చండిక ప్రవేశించుచున్నది.]

చండి—అమ్మా! యెందుకు పిలిచినారు? మీ సెలవుప్రకారం వారికి గదిచూపి—

అన్న—నీవు వెంటనే మడికట్టుకొని వీరిభోజనానికి విస్తళ్ళువేసి వడ్డనచేయించు.

ధన—చండీ! వేగిరం రా. మీయజమానురాలు చెప్పినట్లు వెంటనే చేయించు.

చండి—పక్షిలాగు యెగరడానికి నాకు రెక్కలులేవు. ఇక్కడా. అక్కడాకూడా వక్కమాటే వుండడానికి నీకోసం దేవుడు నాకు దేహాలురెండైనా పెట్టినాడుకాడు. అట్టే తొందరపెట్టకండి. వెయ్యిమందికి సంతర్పణచేసినప్పుడైనా నాకింత తొందరకలుగలేదు.

ధన—ఇది బాగావున్నది. నౌకర్లు యిలా నిర్లక్ష్యంగా మాట్లాడుతూవుంటే నేను సహించలేను. పెద్దమనుష్యులు యిది తమ్ము అవమానంచేసినట్టు యెంచుకుంటారు. నీకు బుద్ధిచెపుతాను. నీవు ఇఖ

ముందు యెప్పుడూ పెద్దమనుష్యులు మాట్లాడుతూవుంటే యెదురు జవాబు చెప్పకు.

చండి—పెద్దమనిషి నాతోమాటాడితే నేను యెప్పుడూ యెదురుజవాబే చెప్పను. (అని వెనుక తిరుగుచున్నది.)

ధన—సరిసరి. బాగానేవున్నది. భోజనాలు రేపుచెయ్యవలెను గాని యిఖ యివాళ వడ్డనఅయ్యేటట్లే కనపడదు. దయచేసి లోపలికి వేగిరంవెళ్ళి వెంటనే వడ్డనఅయ్యేటట్టు చెయ్యి.

చండి—అమ్మగారు కోపపడుతారుగాని లేకపోతే యితనికి బుద్ధివచ్చేటట్టు చేస్తును. (అని వెళ్ళుచున్నది.)

ధన—అన్నపూర్ణమ్మా! బాగావిను. భోజనాలవేళ యెవరైనా చక్రకేళీ అరటిపళ్ళు తెమ్మంటే వెయ్యకు. అవి చాలాప్రియం ఆమున లాయన చక్రకేళీపళ్ళు తెమ్మంటే పొరపాటున పంపించినట్లు బొంత పళ్ళు పంపించు. నేనుచెప్పింది తెలిసిందా?

అన్న—భోజనానికి వచ్చినవారు యేవికావలెనంటే అవల్లా వడ్డించి తరువాత సొమ్ము పుచ్చుకోవడం యిక్కడ ఆచారం.

ధన—ఇదివరకు యేర్పరుచుకున్న ప్రకారం పిండివంటలతోనూ కూరలతోనూ పెట్టేభోజనానికయ్యే అర్ధరూపాయికి మాత్రమే నేను జవాబుదారీచేస్తాను. ఎవరైనా యెక్కువవస్తువులు కావలెనంటే వాటి సొమ్ము వారివద్దనే పుచ్చుకోవలెను.

[చండిక ప్రవేశించుచున్నది]

చండి—అయ్యా! వడ్డన అయిందిఁ. ఇఖ మీరు మీవారితో కూడా భోజనానికి రావచ్చును.

విజ—(లేచి) వడ్డనయిందంటావా? ఇదుగోవస్తావున్నాను.

(అని లోపలికి వెళ్ళుచున్నాఁడు)

ధన—ఇది మరీబాగావున్నది. అన్నపూర్ణమ్మా! తలకు అర్ధరూపాయి చొప్పున నేను నలుగురికే సుమా యిస్తానని చెప్పినాను. ఎక్కువమంది భోజనంచేస్తే అవతల నన్ను యివ్వమంటే నేనుయివ్వను. ఇప్పుడేచెప్పినాను.

అన్న—ఆహాహాహా!

ధన—నవ్వు. నీయిష్టంవచ్చినంతసేపు నవ్వు. నేను రెండు రూపాయలకంటె వక్కదమ్మిడీ యెక్కువయివ్వను. వడ్డనయే గదిలో చేసినారో చూపింతువుగానిరా.

[అని ధనపాలుఁడును, అన్నపూర్ణమ్మయు వెళ్ళుచున్నారు]

౨. రంగము—భోజనముచేసెడు పడమటియిల్లు.

[విస్తరిముందు పీటమీఁదకూరుచుండి విజయవర్మయు, సమీపములో నిలుచుండి చండికయు, ప్రవేశించుచున్నారు]

విజ—(జమాఖర్చుపుస్తకమును తీసి పత్రములు తిరుగవేయుచు) మనకు కోనసీమ తోటలవల్ల సాలుకు రెండువేలయేనూరు రూపాయలువస్తవి. ద్రాక్షారామ తాలూకాలోవున్న భూములను మూడువేల యేన్నూరురూపాయలకు అమరకం చేసినాము. ఈయేడు పంటలు బాగావుండవని అంటూవున్నారు. అలాగయినట్టయితే రహితులను తొందరపెట్టక కొంతశిస్తు మానివేతాము. మండపేటకోమటి అయిదువేలరూపాయలు యీనెలాఖరులోగా తీర్చవలెను. పాపము, అతనికి వడ్డీ మానివేస్తాను. నా దగ్గిర యేబయివేలరూపాయలు నిలవవున్నవి గదా. అందులో పదివేలరూపాయలుపెట్టి యీగ్రామంలో ధర్మసత్రం వేయిస్తే బాగావుండేటట్టుతోస్తూవున్నది. అయినాకానీ యీసంగతి సావధానంగా ఆలోచింతాము.

చండీ—ఈయన విస్తారం భాగ్యవంతుడు కావడమే కాకుండా ధర్మాత్ముడుగా కూడా కనపడుతూవున్నాడు. ఇతడు ధనపాలుని చుట్టంకామల్సును. అందుచేతనే విందుకు పిలిచి వుంటాడు.

[అన్నపూర్ణమ్మ ప్రవేశించుచున్నది]

అన్న—చండీ! అన్నివస్తువులూ జాగ్రతగా వడ్డించేటట్టు చెయ్యి. లేకపోతే ఆనిర్భాగ్యుడు ధనపాలుడువచ్చి కాట్లకుక్కలాగు మనమీద పడుతాడు. ఈయన యిక్కడకు యేలాగువచ్చినాడు?

చండీ—ఆయనను మాటాడించకవిను.

అన్న—ఆయనను మాట్లాడించడానికి బ్రహ్మతరంకాదు. ఈ గోడలతో మాట్లాడితే యెంతవిని పించుకుంటవో యీాయనా అంతే వినిపించుకుంటాడు. ఈయనకు వల్లమాలిన చెవుడు.

చండీ—పాపం. ఇంతచిన్నతనంలో యీాయనకు చెవుడుపట్టు కున్నదా? ఈయన బహుభాగ్యవంతుడు.

అన్న—ఈయన భాగ్యవంతుడని నీకు యెట్లా తెలిసినది?

చండీ—ఆచేతులోవున్న పుస్తకం చదివి యీాయన జమాఖర్చులు చూచుకుంటూ వున్నాడు. మనం పావలాలూ అర్ధలూ లెఖ్ఖచూచుకునేటట్టుగా, ఈయన వేలూ లక్షలూ లెక్కచూచుకుంటూ వున్నాడు.

అన్న—అలాగయితే యీాయనను యిక్కడకూర్చోనీ. ధనపాలుడువచ్చి యేమయినా అంటే—

విజ—(తలయూచుచు) ఇక్కడ నవుకర్లు యెవరు వున్నారు.

చండీ—ఈయన తనకువలెనే లోకానికంతా చెవుడయినట్టు యెంతబిగ్గరగా మాట్లాడుతూవున్నాడో? (అని సమీాపమునకు వెళ్ళుచున్నది.)

విజ—సరి. నీవేనానవుకరువు? భోజనానికి యెంత ఆలస్యం వున్నది?

చండి—ఆలస్యంలేదు. మీ సెలవు యెప్పుడయితే అప్పుడే వడ్డిస్తాము.

విజ—ఆహాహాహా! నేను నిన్ను అడిగినది అసంగతికాదు. భోజనానికి యెంత ఆలస్యం వున్నదని అడిగినాను. (అన్నపూర్ణమ్మతో) అమ్మా! మీ నవుకరుకు కొంచెం చెవుడుకాబోలును. ఈ చిన్నది అందకత్తె.

అన్న—చండీ! ఈయన నిన్ను అందకత్తెవు అంటూవున్నాడు. నీకంతేచాలునులే.

చండి—ఈయనకు చెవులు చెడిపోయినా కళ్ళుచెడిపోనందుకు సంతోషిస్తూవున్నాను.

[ధనపాలుఁడును, ఇందుముఖియు, విశాలాక్షియు,
సుమంత్రుఁడును ప్రవేశించుచున్నారు.]

ధన—ఇలాగురండి. మనకుమాత్రమే ప్రత్యేకంగా యీగది మాట్లాడినాను. ఇక్కడకు రెండోవారురారు. మనంనలుగురమూకలసి యేకంగా భోజనం చెయ్యవచ్చును.

ఇందు—(విశాలాక్షితో రహస్యంగా) యితడువెఱ్ఱివాడులాగు వున్నాడు.

విశా—(ఇందుముఖితో రహస్యంగా) వూరుకో. అదుగో మన విజయవర్మ వచ్చినాడు.

సుమం—పుస్తకంలో పత్రాలు తిరగవేస్తూ మనపీటమీద కూర్చున్నాడు. ఈయనయెవరు? ఇతడుమనవంక తలయెత్తిచూడ నైనా చూడడంలేదు.